


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162


గన్నవరం విమానాశ్రయంలో జగన్ తో సినీ నటుడు బ్రహ్మానందం




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 51 | శుక్రవారం 20 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


## కృష్ణమ్మ ఒడ్డున గోదావరి నేతలకు

# లోకేశ్ విందు...

కూటమి ప్రజాప్రతినిధుల కోసం మంత్రి లోకేశ్ ఆత్మీయ విందులు

రాజమండ్రి, నర్సాపురం నేతలకు ఉండవల్లిలో ఆతిథ్యం

కుటుంబ సమేతంగా హాజరై సందడి చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీలు

మూడు పార్టీలు కాదు ఒకే కుటుంబమని చాటిచెప్పిన నేతలు

మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహూకరించిన లోకేశ్



రాజకీయాల్లో కుటుంబ విలువలకు, సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. కూటమిలోని ప్రజాప్రతినిధుల కోసం ఆయన ఏర్పాటు చేస్తున్న ఆత్మీయ విందు సమావేశాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నాడు... రాజమండ్రి, నర్సాపురం



అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ వర్సిటీ

క్వాంటమ్ ఏఐ సెంటర్, టాలెంట్ హబ్ ఏర్పాటు

విద్యాసంస్థల్లో ఏఐ అకాడమీలు.. ప్రతి విద్యార్థికీ ఏఐ ట్యూటర్

క్వాంటమ్, సైబర్ సెక్యూరిటీలో లక్ష మందికి శిక్షణ

ఏఐ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూలు

క్రియేటర్ ఎకానమీ సెంటర్‌గా ఏపీ.. యువ టెకీలు మా బలం

సమ్మిట్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు భేటీ

# క్వాంటమ్.. కేరాఫ్ ఏపీ!

ప్రపంచ భవిష్యత్ టెక్నాలజీ రంగంలో నవ్యాంధ్రను అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా హస్తిన వేదికగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. క్వాంటమ్ టెక్నాలజీ అనగానే ముందుగా ఆంధ్రప్రదేశ్ పేరే వినిపించేలా రాష్ట్రాన్ని క్వాంటమ్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాజధాని అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసిన రాష్ట్రప్రభుత్వం... దానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి, రాష్ట్రంలో ఏఐ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడానికి ఏడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో ఈ ఒప్పందాలు కుదిరాయి. అమరావతిలో క్వాంటమ్ ఏఐ సెంటర్, అంతర్జాతీయ క్వాంటమ్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ అకాడమీల ఏర్పాటు, క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో లక్ష మంది యువతకు శిక్షణ... అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ వివరాలు..

**దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ వర్సిటీ..**

రాజధాని అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

## ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం



ట్రంప్ విధించిన గ్లోబల్ టారిఫ్‌లలో చాలా వరకు చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పు

అధ్యక్షుడు తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని 6-3 మెజారిటీతో స్పష్టం

స్టీల్, అల్యూమినియం వంటి ప్రత్యేక టారిఫ్‌లకు ఈ తీర్పు వర్తించదు

తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్లు లాభాల్లోకి, ట్రేడ్ అనిశ్చితికి తెర

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వస్తే అనుసరించే ఆర్థిక విధానానికి ఇది పెద్ద దెబ్బ

## సాంకేతిక విప్లవంలో

# ఇదో అంకం

మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఏఐ

ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం

ఏఐ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సింఎం రేవంత్ రెడ్డి



గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్శిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం

# తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం తప్పదు

## తన ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన అంబటి

తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం చెల్లించుకునే సమయం వస్తుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పర్మిషన్ తీసుకునే నల్లపాడు వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాను. టీడీపీ నేతలు కర్రలు, రాడ్లు తీసుకుని నా కారు మీదకు వచ్చారు. టీడీపీ నేతలు కట్టిన ఫ్లెక్సీని చించలేదు. ఇది మంచి సాంప్రదాయం కాదని చెప్పా. గూండాలు 4 గంటల పాటు



## పోలీస్ క్రీడలు ప్రారంభించిన మంత్రి అనిత



**పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని వెల్లడి**

అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా

# డేటా సెంటర్లపై త్వరలో ఆర్థిక సర్వే



రాష్ట్రంలో ఎక్స్‌లెన్స్ సెంటర్ పెట్టాలి

ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు ప్రసన్నకుమార్

# శ్రీవారి లడ్డూ కల్తీని కప్పిపుచ్చే యత్నం

మండలిలో వైసిపి సభ్యుల సిగ్గుమాలిన చర్య

తిరుమలేశుడి ఫోటోలతో డ్రామాలు దుర్మార్గం

మండిపడ్డ తెలుగుదేశం ఎంపిలు

శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంలో శాసనమండలిలో వైసీపీ నేతలు వేంకటేశ్వర స్వామి ఫొటోతో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ విషయంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై తెలుగుదేశం ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు పట్టుకుని రాజకీయం చేస్తారా అని ధ్వజమెత్తారు. శాసనమండలిలో వైసీపీ తీరు సిగ్గ సిగ్గు అని ఎద్దేవా చేశారు. 'శ్రీవారి పవిత్ర లడ్డూలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి ఒప్పుకుంటే.. కల్తీ జరగలేదని వైసీపీ నేతలు కంత్రి వేషాలు వేస్తున్నారని దెప్పిపొడిచారు. క్రీడా స్ఫూర్తి చాటే లోకేశ్‌తో.. ప్యాలెస్‌లో పబ్జీ గేమ్ ఆడుకునే జగన్ రెడ్డికి పోలికా?' అని అప్పలనాయుడు సెటైర్లు గుప్పించారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరును సభ్య సమాజం వ్యతిరేకిస్తోందని టీడీపీ ఎంపీ సానా సతీశ్ పేర్కొన్నారు.

# దేవాదుల మోటర్లు ఎందుకు ఆగిపోయాయి

పంటలు ఎండుతున్నా ఎందుకు పట్టించుకోరు

రైతుభరోసాపై ఇంకా తాత్సారం ఎందుకు

దేవాదుల పంప్‌హౌజ్ వద్ద మీడియాతో హరీష్ రావు



అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.

# క్వాంటమ్.. కేరాఫ్ ఏపీ!

ఈ క్యాంప్‌సలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నిధులు సమకూర్చుతుంది. 10 ఎకరాల భూమి, క్వాంటమ్ హార్డ్‌వేర్‌ను రాష్ట్రం సమకూర్చాల్సి ఉంటుంది. కార్యక్రమంలో కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్, ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

**క్వాంటమ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్** అమరావతిలో క్వాంటమ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యూనిసీసీ)తో రాష్ట్రప్రభుత్వం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి క్వాంటమ్ ఏఐ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంవోయూలో పేర్కొన్నారు. ఒప్పంద కార్యక్రమంలో యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

**అమరావతిలో వైజర్ టాలెంట్ హబ్..** వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టెమ్, ఎంట్రపెన్యూర్‌షిప్ అండ్ రిసెర్చ్ (వైజర్) సంస్థ భాగస్వామ్యంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు టాలెంట్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తాజా ఒప్పందంతో ఈ ఏడాది చివరి నాటికి 3.50 లక్షల మంది, 2027 నాటికి 6 లక్షల మందికి ఏఐ క్వాంటమ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. భవిష్యత్తులో 35 లక్షల మందికి శిక్షణ ఇవ్వడమే ఈ ఒప్పంద లక్ష్యం. కాగా, ఏపీలోని 50కి పైగా ఉన్నతవిద్యా సంస్థలో ఏఐ అకాడమీలు, ఏఐ శాండ్‌బాక్స్ ఏర్పాటు చేసేందుకు కాలిబో ఏఐ సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అలాగే క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో వచ్చే 3-5 ఏళ్లలో రాష్ట్రంలోని లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం ఐబీఎంతో ఎంవోయూ కుదుర్చుకుంది. కార్యక్రమానికి ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రిసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్.. తదితరులు హాజరయ్యారు.

**రాష్ట్రవ్యాప్త ఏఐ టెక్ హబ్..** ఐదంచెల 'స్వదేశీ ఏఐ స్టాక్' ఆధారంగా రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్‌నిర్మించేలా భారత్‌జెన్, నెఎక్స్‌టీజెన్, ఐబీఎంతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతోపాటు 22 భారతీయ భాషలను అనుసంధానించే ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. భారత్‌జెన్ సీఈవో రిషిబాల్, ప్రతినిధి రామకృష్ణన్, నెఎక్స్‌టీ జెన్ సీఈవో రాజగోపాల్, ఐబీఎం రిసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ పాల్గొన్నారు.

**ప్రతి విద్యార్థికీ ఏఐ ట్యూటర్..** పాఠశాల విద్యార్థులకు ఏఐ ట్యూటర్ ఏర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్, బోధన్ ఏఐతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ఏఐ ట్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఈ ఎంవోయూ కుదిరింది. ఈ ట్యూటర్ ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉంటూ, విద్యార్థులకు వ్యక్తిగత శిక్షణ అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామ కోటి, ప్రొఫెసర్ మితేశ్ పాల్గొన్నారు.

# దేవాదుల మోటర్లు ఎందుకు ఆగిపోయాయి

రైతులపై పగబట్టారా..? అంటూ ఫైర్ అయ్యారు. కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో హరీశ్‌రావు శుక్రవారం పర్యటించారు. దేవన్నపేట పంప్‌హౌస్ దగ్గర దేవాదుల మోటార్లని పరిశీలించాక మీడియాతో మాట్లాడారు. మోటార్లు ఎందుకు ఆగాయంటూ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరిలో నీరు వృథాగా పోతున్నా... దేవన్నపేటలో మూడు మోటార్లు పది రోజులుగా ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో మంత్రులు వచ్చి మోటార్లు ప్రారంభిస్తామని చెప్పి.. చివరకు ప్రారంభించకుండా వెళ్లారని దుయ్యబట్టారు. రైతులపై పగబట్టారా..?, కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు 60వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. దేవాదుల ప్రాజెక్టులో అతి పొడవైన, లోతైన పంప్ హౌస్ దేవన్నపేట అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే దేవాదుల థర్డ్ ఫేస్ పూర్తి చేశామని హరీశ్‌రావు ప్రస్తావించారు. నాడు దేవాదులపై కాంగ్రెస్ చిన్నచూపు చూస్తే... కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పూర్తి చేశారని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో దేవాదుల ఆయకట్టును 3లక్షల 17వేల ఎకరాలకు పెంచామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్.. వరంగల్ జిల్లా రైతాంగం నోరుకొడుతోందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో దేవాదులపై రూ.7,300 కోట్లు ఖర్చు చేశామని, 80శాతం ప్రాజెక్టు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు.

2026 మార్చి కల్లా దేవాదుల పూర్తి చేస్తామని మంత్రులు చెప్పారని... ఇప్పటికీ పైసా పని కూడా చేయలేదని నిలదీశారు. పెద్ద పెద్ద డైలాగులు కొట్టిన మంత్రులు ఎక్కడికి పోయారని హరీశ్‌రావు నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా నిలిస్తే కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఏమీ పట్టనట్టుగా ఉంటోందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తమ హయాంలో దేవాదుల ప్రాజెక్టు మీద రూ.7,300 కోట్లు ఖర్చు పెట్టి 80 శాతం పనులు పూర్తి చేశామని పేర్కొన్న ఆయన రేవంత్ ప్రభుత్వం కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడ్డారు.'కేసీఆర్ పాలనలో మేము దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చాం. రూ.7.300 కోట్ల ఖర్చుతో 47 వేలు ఉన్న ఆయకట్టును, 3 లక్షల 17 వేల ఎకరాలకు పెంచాం. మరో 33 వేల ఎకరాలు ఈ ప్రాజెక్టుకు అవసరమవ్వగా.. 30 వేల ఎకరాలు భూసేకరణ కూడా పూర్తి చేశాం. ఇంకొక 3వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. దాదాపు రూ.1,000 నుండి రూ.2,000 కోట్లు ఖర్చు పెడితే ఇంకో 2,40,000 ఎకరాల ఆయకట్టు సృష్టించవచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నర ఏండ్లలో కనీసం రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయలేదని కాంగ్రెస్‌పై హరీష్ రావు విరుచుకుపడ్డారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు.

నాట్ల సమయంలో ఇవ్వాల్సిన 'రైతు బంధు' నిధులను ఇంకా విడుదల చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆయన రైతు బంధు ఎప్పుడిస్తారు? అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. 'మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే 17వ తేదీన రైతుబంధు ఇస్తా అన్నాడు, 20వ తేదీ వచ్చింది. అయినా ఇంకా రైతుబంధు రాలేదు. రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా?.. కోతలు జరిగేటప్పుడు ఇస్తారా?' అని రేవంత్‌ను హరీశ్ సూటిగా ప్రశ్నించారు. 'ఇప్పటికే రెండు పంటలకు రైతు బంధు వేయలేదు,

ఈ సారి అయినా వేస్తారా లేదా? బడా కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్ల కోసం రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించావు కానీ రైతులకు రైతుబంధు వేయడానికి డబ్బులు లేవా?' అని కాంగ్రెస్ సర్కార్ దాటవేత ధోరణిపై హరీష్ రావు ధ్వజమెత్తారు.

## సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చు కోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.




## డేటా సెంటర్లపై త్వరలో ఆర్థిక సర్వే

'దేశంలో కొత్తగా ఏర్పాటవుతున్న డేటా సెంటర్లతో ఆర్థిక పురోగతి ఎలా ఉంటుంది? ఎంతవరకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి? అనే అంశాలపై త్వరలో ఆర్థిక సర్వే నిర్వహించనున్నాం' అని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) జాతీయ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన ఆయన 2026-27 సంవత్సరానికి జాతీయ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను వాల్తేరు క్లబ్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రభుత్వం ఏ కొత్త చట్టాలు చేసినా, వాటిని సరళీకృతం చేసి ప్రజలకు చేరువగా తీసుకువెళ్లేది సీఏలే. కృత్రిమ మేధ అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న మాట వాస్తవమే అయినా అకౌంటెంట్లకు నష్టం లేదు. అయితే ఆధునిక సాంకేతికతను ప్రతి రంగంలోను ఉపయోగించుకోక తప్పదు. మేం ఇప్పటికే ఏఐ టూల్స్ వినియోగిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అది ప్రభుత్వ పాలసీపై ఆధారపడి ఉంటుంది. సీఏ చేస్తే ఉపాధికి ఢోకా లేదు. త్వరలో యువతకు ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం' అని ప్రసన్నకుమార్ తెలిపారు.

## గన్నవరం విమానాశ్రయంలో జగన్ తో సినీ నటుడు బ్రహ్మానందం

### గన్నవరం విమానాశ్రయంలో ఒకరికొకరు తారసపడ్డ జగన్, బ్రహ్మానందం

### ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్న వైనం

### గన్నవరం నుంచి బెంగళూరుకు వెళ్లిపోయిన జగన్

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం కలిశారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో ఈ అరుదైన కలయిక చోటు చేసుకుంది. బెంగళూరుకు వెళ్లేందుకు జగన్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఒక పని మీద గన్నవరం చేరుకున్న బ్రహ్మానందం ఎయిర్ పోర్టులోనే ఉన్నారు. ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బ్రహ్మానందం యోగక్షేమాలు, ఆరోగ్యం గురించి జగన్ అడిగి తెలుసుకున్నారు. వీరి కలయికకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## వయసు 16... ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో అందరి చూపు అతడిపైనే!

ప్రస్తుతం ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఓ భారతీయ బాల మేధావి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 'ఏఐ కిడ్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన 16 ఏళ్ల రావుల్ జాన్ అజు, ఈ అంతర్జాతీయ వేదికపై టెక్ నిపుణులు, దేశాధినేతల నుంచి ప్రశంసలు అందుకుంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అతను సాధించిన అద్భుతమైన ప్రగతికి ఈ సదస్సులో అరుదైన గౌరవం దక్కింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన రావుల్, తనకు ఈ సదస్సులో ప్రసంగించే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. ఏఐ వల్ల కలిగే లాభనష్టాలను, ప్రపంచ సమస్యల పరిష్కారంలో భారత్ ఎందుకు నాయకత్వం వహించాలో తాను వివరించనున్నట్లు తెలిపాడు. ఈ సదస్సులో భాగంగా ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌ను కలిసే అవకాశం కూడా రాహుల్‌కు దక్కింది. "ఆ క్షణంలో నేను ఇంకా షాక్‌లోనే ఉన్నాను. కేవలం 'హాయ్' మాత్రమే చెప్పగలిగాను. ఆయనతో కొన్ని నిమిషాల సంభాషణలో చాలా నేర్చుకున్నాను. అదొక అద్భుతమైన అనుభవం" అని రావుల్ ఆనందంగా పంచుకున్నాడు.

## కృష్ణమ్మ ఒడ్డున గోదావరి నేతలకు లోకేశ్ విందు...

పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులకు ఘనంగా ఆతిథ్యమిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల కోసం ఉండవల్లిలోని తన నివాసంలో కుటుంబసమేతంగా విందు ఏర్పాటు చేశారు. కృష్ణా నది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం వనభోజనాలను తలపించింది. గోదావరి జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు లోకేశ్ దంపతులు ఘన స్వాగతం పలికి, మర్చిపోలేని ఆతిథ్యం ఇచ్చారు. పెద్దల మధ్య సంభాషణలు, పిల్లల ఆటపాటలు, మహిళల పలకరింపులతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నేతలంతా తమ కుటుంబాలతో హాజరై.. కూటమి అంటే మూడు పార్టీలు కాదని, అదొకటేనని చాటిచెప్పారు. ఈ సందర్భంగా నేతలు మంత్రి లోకేశ్ పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనకు ఎంతో ఇష్టమైన రత్నం పెన్‌ను లోకేశ్ కు బహుమతిగా ఇచ్చారు. నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్.. లోకేశ్, బ్రాహ్మణి దంపతుల చిత్రాన్ని వస్త్రంపై ఎంతో కళాత్మకంగా ఎంబ్రాయిడరీ చేసి కానుకగా అందించారు. విందు అనంతరం మహిళలందరికీ లోకేశ్ దంపతులు మంగళగిరి పట్టుచీరలను బహూకరించారు. ఈ ఆత్మీయ విందుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు తమ కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు.

## ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలకు సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన విస్తృత టారిఫ్‌లను (దిగుమతి సుంకాలు) అమెరికా సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. 1977 నాటి అత్యవసర చట్టాన్ని అడ్డం పెట్టుకుని ఏకపక్షంగా టారిఫ్‌లు విధించే అధికారం అధ్యక్షుడికి లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు 6-3 మెజారిటీతో సంచలన తీర్పు వెలువరించింది. ట్రంప్ కార్యనిర్వాహక అధికారాలకు కన్జర్వేటివ్ మెజారిటీ ఉన్న కోర్టు కళ్లెం వేయడం అరుదైన ఘటనగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఈ తీర్పుపై మెజారిటీ తరఫున అభిప్రాయాన్ని రాసిన ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్, అధ్యక్షుడి అధికారాల పరిధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. "అపరిమితమైన మొత్తంలో, కాలపరిమితి లేకుండా, విస్తృత స్థాయిలో ఏకపక్షంగా టారిఫ్‌లు విధించే అసాధారణ అధికారాన్ని అధ్యక్షుడు కోరుతున్నారు. రాజ్యాంగబద్ధంగా చూసినప్పుడు, అటువంటి అధికారాన్ని వినియోగించుకోవాలంటే కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్) నుంచి స్పష్టమైన అనుమతి ఉండాలి. కానీ, ట్రంప్ ఆధారపడిన 1977 చట్టానికి ఆ స్థాయి అధికారం లేదు" అని రాబర్ట్స్ తన తీర్పులో పేర్కొన్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద అధ్యక్షుడికి అసాధారణ పరిస్థితుల్లో దిగుమతులను నియంత్రించే అధికారం మాత్రమే ఉందని, టారిఫ్‌లు విధించే అధికారం లేదని కోర్టు తేల్చి చెప్పింది. "ఆర్థిక లేదా విదేశీ వ్యవహారాల్లో మాకు ప్రత్యేక నైపుణ్యం ఉందని చెప్పడం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం మాకు కేటాయించిన పరిమిత పాత్రను మాత్రమే పోషిస్తున్నాం. ఆ పాత్రను నిర్వర్తిస్తూ, ఐఈఈపీఏ చట్టం అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారాన్ని ఇవ్వలేదని మేము స్పష్టం చేస్తున్నాం," అని జస్టిస్ రాబర్ట్స్ వివరించారు. ఫెంటానిల్, వాణిజ్య లోటు వంటి అంశాలను జాతీయ అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన ట్రంప్, ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని చైనా, మెక్సికో, కెనడా వంటి దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించారు. ప్రపంచవ్యాప్తంగా డజన్ల కొద్దీ దేశాలపై ప్రతీకార టారిఫ్‌లు అమలు చేశారు. ఇందులో భాగంగానే భారత్‌పై 18 శాతం టారిఫ్ విధించారు. దాదాపు 50 ఏళ్ల చరిత్ర ఉన్న ఐఈఈపీఏ చట్టాన్ని టారిఫ్‌ల కోసం ఉపయోగించిన తొలి అధ్యక్షుడు ట్రంప్ కావడం గమనార్హం. అయితే, ఉక్కు, అల్యూమినియం, రాగి వంటి ఉత్పత్తులపై విధించిన రంగాల వారీ టారిఫ్‌లకు ఈ తీర్పు వర్తించదు. వాటిని వేరే చట్టాల కింద విధించడంతో అవి యథావిధిగా కొనసాగుతాయి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, ఇప్పటికే చెల్లించిన బిలియన్ల డాలర్ల టారిఫ్‌లను తిరిగి పొందేందుకు కంపెనీలు ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉంది. కాస్ట్‌కో, టయోటా గ్రూప్, రెవ్లాన్ వంటి వందలాది కంపెనీలు ఇప్పటికే ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తున్నాయి. ఈ తీర్పు ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద ఓటమి అయినప్పటికీ, టారిఫ్‌లు విధించే రాజ్యాంగబద్ధమైన అధికారం కాంగ్రెస్‌కు ఇప్పటికీ ఉంది.

## పోలీస్ క్రీడలు ప్రారంభించిన మంత్రి అనిత

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

## తొందరేమీ లేదు..అన్నింటికీ మూల్యం తప్పదు

బీభత్సం సృష్టిస్తే పోలీసులు ఏం చేశారని అంటూ ఆయన ప్రశ్నించారు. పోలీసులు, గూండాలు ఏకమై దారుణంగా ఇంటిపై దాడి చేశారు. ఆ మాట అనడాన్ని నా అంతరాత్మ ఒప్పుకోలేదు.. నేను బాధపడ్డాను. టీడీపీ నేతలు తిడుతున్నారనే ఉద్దేశంతో మాట అన్నాను. బ్యాచ్‌లుగా బ్యాచ్‌లుగా నా ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో నా పిల్లలు, నా మనవళ్లు ఉన్నారు. పోలీసులు సాక్షిగానే నా ఇంటి మీద దాడి చేశారు. నాలుగు గంటల పాటు నా ఇంటి మీద కరాళ నృత్యం చేశారు. పోలీసులు రక్షణ కల్పించలేక పారిపోండి అన్నారు. ఇదిలావుంటే అక్రమ కేసులో అరెస్ట్ అయ్యి.. బుధవారం బెయిల్‌పై విడుదలైన అంబటి రాంబాబు తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, టీడీపీ రౌడీ మూకలు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసుల నిర్లిప్త వైఖరి, కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం వంటి అంశాలను వైఎస్ జగన్‌కు వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అధికార పార్టీకి ఒత్తాసు పలుకుతూ వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరును జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ భేటీలో అంబటితో పాటు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

## శ్రీవారి లడ్డూ కల్తీని కప్పిపుచ్చే యత్నం

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు వేసుకుని ప్రదర్శిస్తున్న తీరు వైసీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. జగన్ ఆనందం కోసమే ఆ పార్టీనేతలు ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు చేస్తూ వైసీపీ నేతలు కూడా పాపాలూ చేసే పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎవరు చెప్పులు వేసుకుని రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని ఎంపీ సతీశ్ విమర్శించారు. సభ్య సమాజమంతా వైసీపీకి బుద్ధి చెప్పే సమయం వస్తుందని సానా సతీశ్ హెచ్చరించారు. లోకేశ్ క్రికెట్ చూడటానికి వెళ్తే జగన్‌కు వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. లోకేశ్‌ను చూసి జగన్ రెడ్డికి జలసీ, కుళ్లు అని ఎద్దేవా చేశారు. జగన్ ఎక్కడికైనా వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకుని వెళ్లాలని విమర్శించారు. టీవీలో క్రికెట్ చూడాలని జగన్‌కు రాసిపెట్టి ఉందని.. ఆయన నేరస్థుడు కాబట్టి బయటకు వెళ్లి క్రికెట్ చూడలేని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఇతర దేశాలకు వెళ్లాలంటే జగన్ రెడ్డి న్యాయస్థానం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. టీటీడీ లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి హెరిటేజ్‌కు ముడిపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కోను దేవుడు శిక్షిస్తారని.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 మంది సభ్యులు కూడా మిగలరని సానా సతీశ్ సెటైర్లు వేశారు. శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంపై టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పన్న ఎవరి పీఏనో అందరికీ తెలుసని, ఆయనకు సహాయం చేయమని జగన్‌మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి గతంలో తనకు చెప్పారని అన్నారు. సహాయం చేసినందుకు ఆ నింద తనపై పడిందన్నారు.

# సంపద పునఃపంపిణీతోనే సామాజిక న్యాయం సాధ్యం







### రాజ్యాంగ విలువలను మోదీ ప్రభుత్వం కాలరాస్తోంది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు

నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 20 . (నంది పత్రిక ):దేశంలో కొద్దిమంది కార్పొరేట్ల దగ్గర పోగుపడిన అపారమైన సంపదను పన్నుల ద్వారా సేకరించి, ప్రజలందరికీ పునఃపంపిణీ చేసినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సిద్ధిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం కూడలి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా సామాజిక న్యాయ పోరాట గళం వినిపించింది. సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం నేడు పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల తీవ్రమైన ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ, రాజ్యాంగ సంస్థలను తన గుప్పిట్లోకి తీసుకుని గుత్తాధిపత్యం చెలాయిస్తోందని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు ఏకంగా రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రచారం చేయడం వారి కుటిల నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాజ్యాంగ పీఠిక దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం అందించాలని స్పష్టంగా ప్రకటించినప్పటికీ, నేటికీ దేశంలో కుల, మత, లింగ వివక్షలు కొనసాగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదలో 46 శాతం కేవలం ఒక్క శాతం మంది బిలియనీర్ల దగ్గరే కేంద్రీకృతమై ఉందని, 10 శాతం మంది దగ్గర 75 శాతం సంపద పోగుపడిందన్నారు. మోదీ ప్రభుత్వం అంటేనే కార్పొరేట్ల ప్రభుత్వమని, అందుకే కార్పొరేట్ పన్నును 35 శాతం నుండి 22 శాతానికి తగ్గించిందని విమర్శించారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ఎస్సీ సెల్ మాలమహానాడు నాయకుడు కడియం సాంబశివుడు, అల్ మేవా సంస్థ గౌరవాధ్యక్షుడు అబులేసు, ఎస్.డి.పి.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజాస్ లు మాట్లాడుతూ.. సంపద పన్ను, వారసత్వ పన్ను చట్టాలను రద్దు చేయడం ద్వారా పేదలపై భారం మోపి, ధనికులకు రాయితీలు ఇస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు ఏకంగా 20 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీలు చేసిన పాలకులు, సామాన్య ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలను మాత్రం 'ఉచితాలు' అంటూ అవహేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని విమానాశ్రయాలు, పోర్టులు, గనులు, సహజ వాయువు నిక్షేపాలను కార్పొరేట్లకు కట్టబెట్టడం ద్వారా బీజేపీ ప్రభుత్వం ఎన్నికల నిధులు పొందుతోందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని, దీనివల్ల గ్రామీణ పేదల బతుకులు చితికిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యాలయాల్లో గత ఐదేళ్ల కాలంలో కుల వివక్ష కేసులు 118 శాతం పెరగడం దారుణమని, ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమానత్వానికి పెను ముప్పుగా పరిణమించిందని నేతలు పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ తెచ్చిన సమానత్వ మార్గదర్శకాలను సంఘ్ పరివార్ శక్తులు తెరచాటున అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం అంటే కేవలం నినాదాలు చేయడం కాదని, కార్పొరేట్ల దగ్గర ఉన్న సంపదను పన్నుల రూపంలో సేకరించి సామాన్యుడికి పంచడమేనని వివరించారు. రద్దు చేసిన సంపద పన్ను, వారసత్వ పన్నులను తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా దేశానికి వచ్చే 20 లక్షల కోట్ల రూపాయల అదనపు ఆదాయంతో 'జాతీయ సంక్షేమ నిధి'ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అట్టడుగు వర్గాలకు విద్య, వైద్యం, ఉపాధి సమానంగా అందడమే నిజమైన సామాజిక న్యాయమని, అందుకోసం శ్రామిక సంఘాలు, దళిత, బహుజన, మైనారిటీలు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. మత విద్వేష రాజకీయాలను తిప్పికొట్టి, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం తాము ఎప్పుడూ ముందుంటామని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ రాముడు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. సోమన్న, ఎస్సీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నేసే ప్రసాద్, మాల మహానాడు నాయకులు రమేష్, పెరుమాళ్ళ రాముడు, చిన్నయ్య, శేఖర్, నాగరాజు, సిపిఐ నాయకుడు ధనుంజయ్, బీసీ సంఘం నాయకులు తిరుపతి, శేఖర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పెద్ద మున్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. హరినాథ్, గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు తుపాకుల వెంకటేశ్వర్లు, సుంకన్న. తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

### -అస్తిత్వానికి ఆయువుపట్టు మన మాతృభాష



నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 20 . (నంది పత్రిక ):భాష కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి సంస్కృతికి, చరిత్రకు మరియు ఆత్మగౌరవానికి ప్రతిరూపం. ప్రతి ఏటా ఫిబ్రవరి 21న జరుపుకునే 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' మన మూలాలను గుర్తుచేసే ఒక గొప్ప సందర్భం.రక్తతర్పణంతో పుట్టిన ఉద్యమం మాతృభాష కోసం ప్రాణాలర్పించిన వీరుల భూమి బంగ్లాదేశ్. 1947లో దేశ విభజన తర్వాత నేటి బంగ్లాదేశ్ 'తూర్పు పాకిస్థాన్'గా ఉండేది. అప్పటి పాలకులు మెజారిటీ ప్రజల భాష అయిన బెంగాలీని కాదని, ఉర్దూను అధికార భాషగా రుద్దాలని చూశారు.దీనికి వ్యతిరేకంగా బెంగాలీలు ఉవ్వెత్తున ఉద్యమించారు. 1952 ఫిబ్రవరి 21న ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులపై జరిగిన పోలీసు కాల్పుల్లో నలుగురు యువకులు అమరులయ్యారు. ఒక భాష కోసం జరిగిన ఈ రక్తపాతం అంతర్జాతీయ సమాజాన్ని కదిలించింది. ఫలితంగా 1956లో పాకిస్థాన్ ప్రభుత్వం బెంగాలీని అధికార భాషగా గుర్తించక తప్పలేదు. ఆ అమరుల త్యాగానికి గుర్తుగానే యునెస్కో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది.

**మాతృభాషతోనే మేధో వికాసం** ప్రస్తుతం భారతదేశంతో పాటు అనేక ఆసియా దేశాల్లో ఆంగ్ల వ్యామోహం పెరిగిపోతోంది. మాతృభాషను నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థులలో సహజమైన ఆలోచనాశక్తి, సృజనాత్మకత లోపిస్తున్నాయని యునెస్కో హెచ్చరిస్తోంది.శాస్త్రీయ దృక్పథం: ప్రాథమిక విద్య మాతృభాషలో సాగినప్పుడే పిల్లలు విషయాన్ని త్వరగా అర్థం చేసుకోగలరు.సాంస్కృతిక వారసత్వం: భాషా పరిరక్షణ అంటే మన ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే.గాంధీజీ సందేశం: "మాతృభాషను తృణీకరించడం అంటే మాతృమూర్తిని నిరాకరించడమే" అని గాంధీ మహాత్ముడు నొక్కి చెప్పారు.తెలుగు భాషా స్థితిగతులు – మన బాధ్యత "దేశ భాషలందు తెలుగు లెస్స" అని చాటుకున్న మనం, నేడు తెలుగులో మాట్లాడటాన్ని అవమానంగా భావించే స్థితికి చేరుకోవడం విచారకరం. బతుకుదెరువు కోసం ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు, కానీ పునాది మాత్రం మాతృభాషే కావాలి.ముఖ్యమైన సూచనలు: ఆధునికీకరణ: శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని తెలుగులోకి అనువదించి, ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా భాషను మార్చుకోవాలి.కుటుంబం నుంచే ప్రారంభం: పిల్లలకు అమ్మ ఒడిలోనే తెలుగు భాషపై మమకారాన్ని పెంచే బాధ్యత తల్లిదండ్రులదే.ప్రభుత్వాల పాత్ర: విద్యా మాధ్యమంగా తెలుగును బలోపేతం చేస్తూ, పాలనలో తెలుగుకు పెద్దపీట వేయాలి.

**ముగింపు** తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాకుండా మరెక్కడో లభించదు. ఆంగ్లాన్ని ఒక భాషగా ఆహ్వానిద్దాం, కానీ తెలుగును మృతభాషగా మార్చవద్దు. మన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవాలంటే మాతృభాషను గుండెల్లో దాచుకోవాలి. లేదంటే రాబోయే తరాల దృష్టిలో మనం 'భాషా ద్రోహులు'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది."తెలుగు మన ప్రాణం.. తెలుగు మన గౌరవం. మన భాషను కాపాడుకుందాం – మన జాతిని గౌరవించుకుందాం!" రచన: కొప్పుల ప్రసాద్, నంద్యాల.

# కోవా బన్ వ్యాపారి వలికి మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ సంఘీభావం.





### రంజాన్ తొలి ఇఫ్తార్‌లో పాల్గొన్న మైనారిటీస్ సంస్థ చైర్మన్.

వెలుగోడు, ఫిబ్రవరి 20 (నంది పత్రిక):వెలుగోడు మండల పరిధిలోని మదరసా జామియా సిరాజుల్ ఉలూం లో గురువారం ప్రత్యేక వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు టీడీపీ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ కోవా బన్ వ్యాపారి వలిని పరామర్శించేందుకు విచ్చేసి, రంజాన్ మాసం తొలి రోజు నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో చిన్న వ్యాపారి వలికి సంఘీభావం తెలియజేయడానికి వచ్చిన సందర్భంగా, అదే కోవా బన్‌తో ఉపవాసం (రోజా) విరమించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా జరిగింది. చిన్న వ్యాపారులకు అండగా నిలుస్తూ, వారి జీవనోపాధికి ప్రోత్సాహం ఇవ్వాలనే సంకల్పాన్ని ఈ చర్య ద్వారా వివరించారు.ఈ సందర్భంగా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ, రంజాన్ మాసం శాంతి, సహనం, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హిదాయత్ అలీ ఖాన్, మోమిన్ రసూల్, మహమ్మద్ రఫీ, సాబీర్ హుస్సేన్, నూరుల్లా, రైతు సంఘం అధ్యక్షులు రాజశేఖర్, స్థానిక మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ఉన్నారు

## సహకార సంఘాల ఉద్యోగుల నిరవధిక సమ్మె.



వెలుగోడు, ఫిబ్రవరి 20 (నంది పత్రిక): వెలుగోడు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ఉద్యోగుల రైతుల మద్దతుతో నిరవధిక సమ్మె ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక పిలుపు మేరకు నిర్ణయించిన తేదీ నుండి వెలుగోడు బ్రాంచ్ పరిధిలో ఉన్న వెలుగోడు సహకార సంఘం, రేగడగూడూరు సహకార సంఘం, మద్దూరు సహకార సంఘం, పరమటూరు సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది.సమ్మె సందర్భంగా సంఘ ఉద్యోగులు మాట్లాడుతూ, తమ చిన్నచిన్న న్యాయమైన కోరికలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గత కొద్ది రోజులుగా దశలవారీగా ఆందోళనలు చేపడుతున్నామని అన్నారు. అయితే ప్రభుత్వ పెద్దల నుండి గానీ, పై అధికారుల నుండి గానీ ఎలాంటి హామీ అందకుండా రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నాము అని పేర్కొన్నారు ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఇవి:జీవో నెం. 36ను తక్షణమే అమలు చేయాలి.సహకార సంఘ ఉద్యోగులకు రూ. 5 లక్షల గ్రాచ్యుటీ చెల్లించాలి.విధుల్లో ఉండగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం అందించాలి.డీఎల్ఈసీ లేదా ఎస్ఎల్ఈసీ ఏర్పాటు చేసి జీతభత్యాల చెల్లింపులు చేయాలి.డ్యూటీ శిక్షణను రద్దు చేసి, రుణాలను సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలి.ప్రస్తుతం పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు సీనియారిటీ ప్రాతిపదికన సీఈఓలుగా ప్రమోషన్లు ఇవ్వాలి.2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఓలు ఎస్. కృష్ణమోహన్, ఎస్. మృతుజావలి, బి. జంబులయ్య, జి. గోపాల్, జి. కిరణ్ కుమార్, బి. విజయకుమార్, జె. శ్రీకాంత్, కే. రాము నాయక్, వై. సురేష్ రెడ్డి, కే. జనార్దన్ ఆచారి, బి. రామకృష్ణుడు, బి. పవన్ కళ్యాణ్ రెడ్డి ఉన్నారు. అలాగే రైతులు విజయకుమార్, వెంకటస్వామి, కృష్ణారెడ్డి, ఆనంద్ కుమార్ రెడ్డి, విజయ మనోహర్ రెడ్డి, పాల్గొని సంఘీభావం. తెలిపి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దివ్యాంగులపై కూటమి ప్రభుత్వానికి చిన్న చూపు.





బేతంచెర్ల ఫిబ్రవరి 20 ( నందిపత్రిక ). దివ్యాంగులపై కూటమి ప్రభుత్వానికి చిన్న చూపు తగదని, స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి, కార్యదర్శి బి.రాముడు అన్నారు.శుక్రవారం సంఘం కార్యాలయం నందు వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతం లోని శ్రీనివాసులు దీర్ఘకాలిక వ్యాధితో బాధ పడుతూ 5 సంవత్సరముల కాలము గడిచినది.దండగల శ్రీనివాసులు కు, సదరం క్యాంపులో 2 సార్లు హాజరైనా గాని "0"శాతం వేశారు వైద్యులు. శ్రీనివాసులు పూర్తిగా నడవలేడు.మాట్లాడ లేడు. ఆయన భార్య శ్రీనివాసులుకు 24 గంటలు సపర్యలు చేయాలే తప్ప, స్వతహాగా ఏ పనిశ్రీనివాసులు చేయలేడు.వైద్యులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం సరికాదు.కూలీ పని చేసుకుంటే తప్ప పూట గడవని పరిస్థితిలో ఆయన కుటుంబం ఉన్నది.గుడిలో ఉండే దేవుడైనా కణికరిస్తాడేమో గాని,పూజారి కణికరివ్వడు అన్న సామెత లాగా అయ్యింది శ్రీనివాసులు పరిస్థితి.దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం ఏ మాత్రమూ సహాయం చేయడం లేదు.అయ్యా! కూటమి ప్రభుత్వం వచ్చిన నాటినుండి దివ్యాంగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.నేటికి ఏడాదిన్నార కాలం గడిచినా కూడా,కొత్త వారికి దివ్యంగా పింఛన్ మంజూరు చేయలేదని, ఇంతటి అన్యాయం ఏ ప్రభుత్వం కూడా చేయలేదని బాధను వ్యక్తం చేశారు.ఇప్పటికైనా పాలక ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు, పింఛన్ సౌఖర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కె.మద్దమ్మ, శకుంతల, సురేష్, రామ మోహన్, రామాంజనేయులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ 6 వ తరగతి ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తులు.



బేతంచెర్ల ఫిబ్రవరి 20 ( నందిపత్రిక ). బేతంచెర్ల మండలం గోరుమానకొండ గ్రామ పరిధిలో గల ఏపీ మోడల్ స్కూల్ 6 వ తరగతి ప్రవేశం కొరకు, ప్రస్తుతం 5 వ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ టి. మరియ దాసు శుక్రవారం తెలియచేశారు. ఈ నెల ( ఫిబ్రవరి ) 24వ తేది మంగళవారం నాటి నుంచి విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకో వచ్చునన్నారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మార్చి 31వ తేది అని తెలిపారు.దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 12వ తేదీ నాడు గొరుమానుకొండ మోడల్ స్కూల్ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష వ్రాసిన విద్యార్థుల యొక్క ఫలితాలు ఏప్రిల్ 27వ తేదీన ప్రకటించి,అదే రోజు మెరిట్ లిస్టు మరియు సెలక్షన్ లిస్ట్ తయారు చేసి,మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. కావున మోడల్ స్కూల్ 6 వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవాలనుకున్న విద్యార్థులు మీసేవా కేంద్రాల ద్వారా గాని లేదా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చు . పూర్తి సమాచారం కొరకు లేదా అదనపు సమాచారం కొరకు గొరుమానకుండ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆఫీసును సంప్రదించ వచ్చును అని తెలిపారు.

## ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ బస్సులు



బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 20 : నంద్యాల ఆర్ టి సి డిపో నుండి బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలకు శుక్రవారం బస్సులను నడిపారు. బండి ఆత్మకూరులో నెల రోజుల నుండి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో బస్సులు తిరిగెందుకు అంతరాయం ఏర్పడింది. బండి ఆత్మకూరు మండలంలో కడమల కాలువ,ఈర్నపాడు, లింగాపురం, రామాపురం, పార్లపల్లె,తదితర గ్రామాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఆర్టీసీ బస్సులలో ఆదర్శ పాఠశాలకు వస్తూ ఉండేవారు. రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ఆర్టీసీ బస్సులు బండి ఆత్మకూరు దర్గా వద్దనే నిలిచిపోయే పరిస్థితి ఉండింది దీనితో పిల్లలు అక్కడి నుండి దాదాపు రెండున్నర కిలోమీటర్ దూరంలో ఉన్న ఆదర్శ పాఠశాలకు నడుచుకుంటూ అవస్థలు పడ్డారు. సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో శుక్రవారం నాటి నుండి ఆర్టీసీ బస్సులు యధావిధిగా పాఠశాలకు నడిపారు. దీనివల్ల విద్యార్థిని విద్యార్థులు ఎంతో సంబరపడుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలు చేయాలి





### ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు పరిహారం త్వరితగతిన మంజూరు చేయాలి

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**కర్నూలు, నంది పత్రిక.....**ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు...శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు కు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధిత కుటుంబాలకు ఉపాధి, ఇంటి స్థలం, అర్హత కలిగిన ఇతర ప్రయోజనాలను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు..ఎస్సీ, ఎస్టీ తదితరులపై అత్యాచారాలు జరగకూడదని, అలాంటివి జరిగితే చట్ట ప్రకారం కేసులు బుక్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల ఖచ్చితంగా సివిల్ రైట్ డే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఓ లను ఆదేశించారు... 2013 నుండి 2025 వరకు పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను పోలీసు అధికారులతో సమీక్షించారు..చాలా రోజుల నుంచి పెండింగ్ లో ఉన్న కేసులను కూడా త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు... జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి బి.రాధిక గత సమావేశంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో డివిఎంసి సభ్యులు ప్రస్తావించిన అంశాల పై అధికారులు తీసుకున్న చర్యల గురించి వివరించారు.. పారిశుధ్య కార్మికులకి గ్లోవ్స్, ఇతర పరికరాలను అందించండి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం అనంతరం సఫాయి కర్మచారుల సమావేశం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకి గ్లోవ్స్ , ఇతర పరికరాలను అందించాలని జాయింట్ కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.. సమావేశంలో హౌసింగ్ పిడి చిరంజీవి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి బి.రాధిక, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు..

# పూర్వ విద్యార్థి విరాళం




**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 20 . (నంది పత్రిక ):**మోడల్ ప్రైమరీ స్కూల్ రాయమాల్పురం పాఠశాలకు పూర్వ విద్యార్థి షేక్ కట్టుబడి అబ్దుల్ కలాం 2000/-విరాళం అందించినట్లు ఇంచార్జ్ హెచ్ ఎమ్ ఓబయ్య తెలిపారు.ఆయనకు పాఠశాల స్టాఫ్ సుజాత, సత్యవతమ్మ మరియు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# అరుంధతీ నగర్ లో ప్రసరించిన హైందవ తేజం శివాజీ వెలుగులు



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 20 . (నంది పత్రిక ):**కర్నూల్ విభాగ్ ప్రౌఢ ప్రముఖ్ రాం ప్రసాద్, నగర ప్రచార ప్రముఖ్ చింతల పల్లి వాసు, జాగృతి ప్రముఖ్ జింకా నరేంద్ర ఆధ్వర్యంలో స్థానిక అరుంధతీ నగర్ (హరిజన వాడలో) హిందూ హృదయ సామ్రాట్ట్, హిందూ పద పాద్ షాహీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు వైభవం గా జరిగాయి. ఎటు చూసినా నైరాశ్యం నిండిన ఆనాటి సామాజిక పరిస్థితులలో స్వాభిమానం తో శివాజీ ఎలా స్వధర్మం కోసం పోరాడాడో వివరించారు. స్థానిక పెద్దలు యువకులు దాదాపు 50 మంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం






**కర్నూలు నంది పత్రిక.....** గౌరవ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం స్థానిక అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ , దూపాడు నందు ప్రపంచ సామజిక న్యాయ దినోత్సవాన్ని ఘణంగా నిర్వహించారు . జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లడుతు సామాజిక న్యాయాన్ని ఆ కాశీక్షి స్తూ ఫిబ్రవరి 20 న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు . ఈ రోజును పేదరికం, లింగ సమానత్వం, నిరుద్యోగం, మానవ హక్కులు, సామాజిక రక్షన వంటి సమస్య లను పరిష్కరించ డం కోసం జరుపు కుంటున్నామని తెలిపారు. విలువలు, స్వేచ్ఛ,వ్యక్తి గౌరవం, భద్రత, ఆర్థిక సామాజిక పురోభివృద్ధి వంటి ప్రాథమిక అంశాల విషయంలో ఎటువంటి వివక్షత పాటించకుండా సామాజిక న్యాయం అమలు అయ్యేలా చూడడం ఈరోజు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. లీగల్ సర్వీసెస్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సామాజిక సంస్థలు ఈ దినోత్సవం రోజున సామాజిక న్యాయం పై ప్రజల్లో అవగాహన కొరకు ప్రచారం చేస్తాయని తెలిపారు. సామాజిక న్యాయం యొక్క అవశ్యకత గురించి విద్యార్థులకు బోధించడానికి పేదరికం,ప్రపంచ పౌరసత్వం, మానవ హక్కులు, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలు ప్రధానమైనవి అని తెలిపారు. అనంతరం సోషల్ జస్టిస్ కాన్సెప్ట్ పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జడ్జి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యన్. మగేశ్వరి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. ఎ. శివకుమార్, అడ్మినిస్ట్రేటర్ దావల్ ఈశ్వర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వలి, కాలేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి

### ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి భూమి పూజ





**మహానంది,ఫిబ్రవరి 20 (నంది పత్రిక):-** ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి పేర్కొన్నారు.మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు.ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి చొరవతో మంజూరు చేసిన రూ.36 లక్షలతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని,గ్రామ సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ,తహశీల్దార్ రమాదేవి, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామల జనార్ధన్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి,మాజీ మండల అధ్యక్షులు ఉల్లి మధు,క్లస్టర్ ఇంచార్జ్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి,టీడీపీ యూనిట్ ఇంచార్జ్ భాష్యం రాముడు గౌడ్,గ్రామ అధ్యక్షుడు మిద్దె శేఖర్,మారెడ్డి జయరాముడు,ఉప సర్పంచ్ పోక వుసేని,వేమూరి కేశవరావు,సాయి బాబా,పెద్ద బుజ్జి,నంది శ్రీను, భూపాల్ రెడ్డి, నాగేంద్ర,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోవా బన్ వలి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్ట్) , అవాజ్ డిమాండ్



**వెలుగోడు, ఫిబ్రవరి 20 (నంది పత్రిక):**మేడారం లో జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జీవనోపాధి కోసం కోవా బన్ విక్రయించిన వెలుగోడు వాసి షేక్ క్షావలి (వలి) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్ట్) మరియు అవాజ్ నాయకులు డిమాండ్ చేశారు. వలి కుటుంబానికి తక్షణమే రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని వారు నిర్ణయించారు.జాతరలో కోవా బన్ను రూ.10 సరసమైన ధరకు విక్రయిస్తున్న సమయంలో, ఒక యూట్యూబర్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆహారంలో కల్తీ ఉందని, విషం ఉందని ప్రచారం చేయడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని వారు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గురువారం సీపీఎం ప్రతినిధి బృందం వలి కుటుంబాన్ని పరామర్శించింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్, జిల్లా నాయకులు ఏ.రణధీర్, అవాజ్ నాయకులు మహమ్మద్ రఫీ, షేక్ ఇస్మాయిల్, రైతు సంఘం నాయకులు వీరన్న, సీఐటీయూ మండల కార్యదర్శి నాగమోహన్ అవాజ్ కమిటీ సభ్యులు నూరుల్లా మాట్లాడుతూఒక చిరువ్యాపారిని భయభ్రాంతులకు గురిచేసి అతని జీవనోపాధిని దెబ్బతీసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.వలి కుటుంబానికి ప్రజలు మద్దతుగా నిలవడం భారతదేశంలోని మానవత్వం, భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించిన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.

## గంజాయి కేసులో వైసీపీ ఎంపీటీసీ అరెస్ట్

నగేశ్ బాబును కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్ లో ఆయనపై కేసు నమోదైంది. పరారీలో ఉన్న ఆయనను పోలీసులు ఈరోజు అరెస్ట్ చేశారు. వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడికి నగేశ్ బాబు అనుచరుడనే ప్రచారం జరుగుతోంది.

# మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహణ




**వెలుగోడు, ఫిబ్రవరి 20 నంది పత్రిక:** వెలుగోడు మండల ప్రజా పరిషత్ నందు శుక్రవారం ఎంపీడిఓ మధుసూదన్ రెడ్డి డిప్యూటీ ఎంపీడీఓ గంధం మురారి ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అన్ని పంచాయితీ అభివృద్ధి అధికారులు (1 నుండి 5 వరకు) మరియు అన్ని డిజిటల్ సహాయకులు. "స్వర్ణ పంచాయితీ పోర్టల్‌కు సమలేఖనం చేయబడిన స్వంత మూల ఆదాయము" అనే అంశంపై ఈ శిక్షణ ఏర్పాటు చేయబడింది.గ్రామ పంచాయితీల స్వంత ఆదాయ వనరులను పెంపొందించడం, వాటిని సరిగ్గా నమోదు చేయడం, అలాగే స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో సక్రమంగా అప్‌లోడ్ చేసి సమన్వయం చేయడం వంటిది. విషయాలపై సవివరంగా అవగాహన కల్పించారు.అధికారులు గ్రామ పంచాయితీల ఆర్థిక బలపాటుకు స్వంత ఆదాయ వనరుల ప్రాధాన్యతను వివరించారు. పన్నులు, ఫీజులు మరియు ఇతర స్థానిక ఆదాయ వనరులను సమర్థంగా సేకరించి, పారదర్శకంగా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయితీల పరిపాలనలో పారదర్శకత పెంపొందించడంతోపాటు, డిజిటల్ వ్యవస్థల వినియోగం మరింత మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజలను సందర్శించిన రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ మణి



**చిత్తూరు జిల్లా బ్యూరో, (నంది పత్రిక ) ఫిబ్రవరి 20 :** కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ పరిధిలో గల అడవిములకలపల్లి గ్రామంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి ఇంటింటా వెళ్లి కుటుంబాలను సందర్శించి తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మీకు ఎల్లప్పుడూ తోడు ఉండి సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. అడవి ములకలపల్లి గ్రామ ప్రజలు మణి ను అభినందించారు.

# తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్లో 6 తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

### ప్రిన్సిపల్ కే. లక్ష్మణ రావు.



**మహానంది, ఫిబ్రవరి 20 (నంది పత్రిక):-** మహానంది మండల ఈ తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్లో 6 వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ మొదలైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కే. లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ప్రవేశాలకు సంబంధించిన వివరాలు విడుదల చేసినట్లు తెలిపారు.ఈనెల 23వ తేదీ నుంచి, మార్చి 31వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.ప్రవేశ పరీక్ష తేదీ 20 ఏప్రిల్ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష ఫీజు ,ఓసి, బిసి లకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 ఉంటుందని తెలిపారు. 2024-25, 2025-26 విద్యా సంవత్సరంలో 4,5 తరగతుల్లో చదివి ప్రమోషన్ కు అర్హత కలిగి ఉండాలని,ఓసి, బీసీ విద్యార్థులు 1 సెప్టెంబర్ 2014 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టి విద్యార్థులు 1 సెప్టెంబర్ 2012 తేదీ నుండి 31 ఆగస్టు 2016 తేదీ మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు షిషి.ఎంవ.ఖజూ.స్త్రశీజ.అఅ లేదా షిషి. ఖజూఎం.ఖజూఎటంం.అఅ వెబ్సైట్ల నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాల 9492406058, 9502429106 చరవాణి నెంబర్లను సంప్రదించాలన్నారు.



# " దోమల నియంత్రణ " ప్రజల అందరి భాధ్యత

### టి. నరసింహా రెడ్డి సబ్ - యూనిట్ ఆఫీసర్



**బద్వేల్, ఫిబ్రవరి 20 (నంది పత్రిక):** దోమల నియంత్రణ ప్రజల అందరి భాధ్యత అని, ప్రతి ఒక్కరు దోమతెరలు వాడటం శ్రేయస్కరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహ రెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో తిరువెంగలపురం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఇల్లులు తిరిగి బానలు, ఫ్రిజ్జులు, డ్రమ్ములు, టైర్లను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. కాచి వడగట్టిన నీటిని త్రాగాలని సూచించారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి, వేల రూపాయలు పోగొట్టుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి మాట్లాడుతూ, దోమల వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. ఏ జబ్బులు వచ్చిన భయపడవలసిన అవసరం లేదన్నారు. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారన్నారు. 104, విలేజ్ హెల్త్ క్లినిక్ లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో ప్రతి ఒక్కరూ వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ధోమ!! ఎంత కంత్రీ ధానివే అటు పక్కా ఉంటావు ఇటు పక్కా ఉంటావు చటుక్కున కాటేసిపోతావు అనే పాటను పాడి నరసింహ రెడ్డి పలువురిని అలరింపజేసారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సిహెచ్ఓ హర్షిత , ఏఎన్ఎం వాణి , హెడ్మాస్టర్ వి. రామ్ మోహన్ కె.గురువి రెడ్డి వైద్యసిబ్బంది పాల్గొన్నారు,.



# బండి ఆత్మకూరులో పిడి సూర్యనారాయణ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 20 :** నంద్యాల జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ శుక్రవారం బండి ఆత్మకూరు మండలాన్ని సందర్శించారు. ఉపాధి హామీ సిబ్బందితో క్లోజర్ ఆఫ్ వర్క్స్ పైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సిమెంట్ రోడ్లు గోకులం షెడ్లు క్యాటిల్ షెడ్లకు సంబంధించి నిర్మాణాలు వెంటనే సిస్టంలో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ పద్ధతి మార్చి లోపల జరగాలని లేకుంటే పేమెంట్లు నిలిచిపోతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ వసుధ, ఎంపీడీవో గాయత్రి, టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ పిఓలు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటన్‌లో ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌పై తీవ్ర దుమారం

ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ బ్రిటన్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఆ దేశ రాజ కుటుంబానికి చెందిన మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్- విండ్సర్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన గురించి మరిన్ని ఆరోపణలు బయటకు వచ్చాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం.. ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసున్న ఓ బాలికకు సెక్స్ రాకెట్ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఆ బాలికను టేబుల్‌పై బంధించి ఈ అరాచకానికి పాల్పడ్డారని ఓ గుర్తుతెలియని వ్యక్తి సమాచారమిచ్చారు. ఈ ఆరోపణలు ఎఫ్‌బీఐ పత్రాల్లో ఉన్నాయి. ఈ ఘటన బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజ్‌లో జరిగిందని ఆ కథనాలు వెల్లడించాయి. అయితే ఆండ్రూ మాత్రం తనపై వచ్చిన ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించారు. 1994 నుంచి 1996 మధ్యలో హ్యూమన్ ట్రాఫికింగ్, మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల గురించి అవగాహన ఉందని సర్రే పోలీసులు వెల్లడించారు. అయితే దానిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. ఈ రెండు ఘటనలకు సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ఆరోపణలకు సంబంధించి ఎవరివద్ద అయినా సమాచారం ఉంటే తమకు రిపోర్ట్ చేయాలని కోరారు.

# ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల




**వెలుగోడు, ఫిబ్రవరి 20 (నంది పత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 164 మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలలు)లో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశ పరీక్షను 1 ఏప్రిల్ 2026 (ఆదివారం) ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.అర్హత వివరాల ప్రకారం ఓసి, బిసి విద్యార్థులు 01-09-2014 నుండి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సి, ఎస్టీ విద్యార్థులు 01-09-2012 నుండి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలి. అలాగే సంబంధిత సంస్థ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 మరియు 2025-26 విద్యా సంవత్సరాల్లో చదివి, ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.దరఖాస్తులను 23-02-2026 నుండి 31-03-2026 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. అభ్యర్థులు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. సిఎస్ఈ. ఏపీ. గవర్నమెంట్. ఇన్ లేదా డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. ఏపీఎంఎస్. ఏపీసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజును నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు లేదా క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాలి.ఫీజు ఓసి/బిసి విద్యార్థులకు రూ.200 కాగా, ఎస్సి/ఎస్టి విద్యార్థులకు రూ.125గా నిర్ణయించారు. ప్రతి మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి ఓసి/బిసి వారికి 35 సీట్లు, ఎస్సి/ఎస్టీ వారికి 30 సీట్లు కేటాయించారు.పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌లను సందర్శించాలని అధికారులు సూచించారు.

# యువత డ్రగ్స్ జోలికి వెళ్ళకూడదు

### కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్



**చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక) ఫిబ్రవరి 20 --** కుప్పం మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... యువత డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టం గురించి వివరించారు. అలాగే నైతిక విలువలు, లక్ష సాధన పై ప్రేరణ, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినీ, విద్యార్థులు విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# కౌలు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**పాములపాడు ఫిబ్రవరి 20 (నంది పత్రిక) -:** అన్నదాత సుఖీభవ పథకం క్రింద కౌలు రైతులకు 20వేల రూపాయలు ఇచ్చి వెంటనే కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు స్థానిక సిపిఎం కార్యాలయం దగ్గర గోడపత్రికలు విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 24 తేదీలలో జిల్లా కలెక్టర్ రేట్ వద్ద జరిగే 30 గంటల దీక్షలలో కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు వ్యవసాయంలో ప్రతి ఏటా సాగు ఖర్చులు బాగా పెరిగిపోయాయని తీరా పంటలను పండించిన తర్వాత గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఒక వైపు ధరలు పెరుగుతూ ఉంటే మరోవైపు ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీలలో కోతలు విధిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద సంవత్సరానికి




6000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం 14000 రూపాయలు మొత్తం 20 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఎన్నికల్లో వాగ్దానం చేసినటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయకపోవడం దుర్మార్గమైనటువంటి చర్య అని పేర్కొన్నారు ప్రధానంగా భూమి మీద 60 శాతం మంది కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నప్పటికీ పెట్టుబడి సాయం అందకపోవడం వలన కౌలు రైతులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు దేవదాయ భూములు కౌలు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ పంటలు లేకపోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంట చేతికి రాక కౌలు రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయన్నారు రైతులు ఆత్మ హత్యలను ఎన్నోసార్లు ప్రభుత్వాలకు నివేదించిన ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ 20000 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్ బాలయ్య శివన్న జాన్ బాబు మక్బుల్ తదితరులు పాల్గొన్నారు

# కోర్టు కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టండి.

### కమిషనర్ ఎన్.మౌర్య.



**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 20 నంది పత్రిక** పట్టణ ప్రణాళిక విభాగంలో ఉన్న కోర్టు కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల పరిష్కారం, బి.పి.ఎస్.,ఎల్.ఆర్.ఎస్, దరఖాస్తులపై శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగంలో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు పరిష్కారం అయ్యేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. పిటిషన్ దారులతో, న్యాయవాదులతో చర్చించాలని తెలిపారు. గౌరవ హైకోర్టు ఆదేశాలు త్వరగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపీ ఖాన్, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్ కోటేశ్వరరావు, టిపిబి ఓ లు మధు, వంశి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి- పిడి



**పాములపాడు ఇప్పుడే 20 ( నంది పత్రిక )-:** ఎన్ఆర్ఈజీఎస్ పంచాయతీరాజ్ శాఖలలో పెండింగ్ ఉన్న వర్క్స్ అన్నిటిని త్వరగా క్లియర్ చేయాలని డ్వామా పీడీ సూర్యనారాయణ ఆదేశించారు శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది టి ఏలకు ఏపీఓ,ఈసీలకు,మండల పర్ఫామెన్స్ పైన రివ్యూ తీసుకోని పలు సూచనలు చేశారు పంచాయతీరాజ్ వర్కులు జరగడానికి బిలో 20 వర్క్స్ అయినటువంటి గ్రామాలలో మిగిలిన వర్కులన్నీ క్లియర్ చేసి పిఆర్ వారికి మెటీరియ ల్ పేమెంట్ వచ్చే విధంగా చేయాలని ఆదేశించారు , శ్రామిక రిపోర్ట్ పెంచాలని,23 తర్వాత సాఫ్ట్ వేర్ మారిపోతాయని మెటీరియల్ కాంపోనెంట్ ఏదైతే ఉందో గోకులం షెడ్లు,సీసీ రోడ్లు,మరియు ప్లాంటేషన్ సంబంధించి ఏవైనా మెటీరియల్ పేమెంట్లు పెండింగ్ ఉంటే త్వరగా పూర్తి చేయాలన్నారు నిర్ణీత సమయంలోపల ఎవరైతే పూర్తి చేయలేకపోతారో ఆ మండలానికి వచ్చే ఫండ్స్ అని కూడా వెనక్కి వెళ్ళిపోతాయన్నారు కావున సంబంధిత ఎఫ్ఎలు గ్రామాలలో మెటీరియల్ కాంపోనెంట్ పనులు మరియు బిల్లులు పూర్తి చేయాలని చేయకపోతే వారి పైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది టి ఏ లు ఈసీ మహ్మద్ గౌస్ ఏపీవో జయంతి మరియు మండల పి ఆర్ ఏ ఈ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు

## ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ వ్యవస్థాపకులకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పురస్కారం




**బనగానపల్లె ఫిబ్రవరి 20నందిపత్రిక** బనగానపల్లెకు చెందిన ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ వ్యవస్థాపకులు షాషావలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరున కడప జిల్లాకు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ ఇచ్చేటువంటి పురస్కారానికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో . శుక్రవారం వలి మాట్లాడుతూ కడప జిల్లా లో ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్న శ్రీ వాజ్ పేయి అద్వాని సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను పీరారెడ్డి బి.యస్ నారాయణ రెడ్డి ఆయన పేరు మీద ఇచ్చే పురస్కారాన్ని మా సంస్థకు ఇస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. సంస్థ వారు ఈనెల 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సంస్థ సేవ ద్వారా నిరంతర సమాజంలో సేవ చేస్తున్నటువంటి ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ కు ఆన్లైన్ ద్వారా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు మీద (సేవా పురస్కారం) పురస్కారం అందించడం జరిగిందని తెలిపారు. గత 6 ఏళ్ళు గా రక్తదాన మరియు అన్నదాన కార్యక్రమలు ఇతర సేవా కార్యక్రమాలు స్వచ్ఛందంగా సేవ చేస్తున్న ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సంస్థ వ్యవస్థాపకుడు అయిన నాకు ప్రథమ పోరాట స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అవార్డ్ కు 2026కు సంతోషించదగ్గ విషయం అన్నారు. పురస్కారంతో మా బాధ్యత మరింత పెరిగిందని అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని వారికి సమయానికి రక్తాన్ని అందించే ర బాధ్యత మరింత పెరిగిందని స్వచ్ఛందంగా సమాజంలో మేం చేస్తున్న మా సేవలను గుర్తించి మాకు ఈ అవార్డ్ అందించినందుకు సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు పురస్కారానికి కారణం అయినా రక్తదాతలు ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సభ్యులు అందరికి అంకితమని పేర్కొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీ సవాల్ కు మంత్రి సుధారాణి కౌంటర్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకుని చెప్పులు, బూట్లతో ఆందోళన చేపట్టడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫొటో లేదా వీడియో చూపిస్తే ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేశారు. వెంటనే స్పందించిన మంత్రి సంధ్యారాణి వైసీపీ సభ్యులు చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. “స్వామి వారి ఫొటోలను ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గం. ఒకరు తలకిందులుగా పట్టుకున్నారు, ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారు. వీళ్లకు దేవుడంటే భయం, భక్తి లేవు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి. వికృత చేష్టలతో స్వామివారిని అవమానించడం కలచివేస్తోంది” అని విమర్శించారు. మాధవరావు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## నూతన వధూవరు లను ఆశీర్వదించిన టిడిపి నాయకులు

**నంది పత్రిక-ప్యాపిలి** ప్యాపిలి లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో జరిగిన టిడిపి నాయకులు సిబిల్లి రాజు కుమార్తె వివాహ వేడుకకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఖాజాపీర్, వెంకటేష్, ఎస్కే వలి, రమేష్, మధు ఈ శుభకార్యానికి విచ్చేసిన నేతలు నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్న టిడిపి నాయకులకు సిబిల్లి రాజు ఆహ్వానించారు. పెళ్లి వేడుకలో పాల్గొన్న నాయకులు వధూవరులతో కలిసి ఫోటోలు దిగి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, మనోహర్, రాజు పాల్గొన్నారు.



# ఎన్ఎండి ఫయాజ్ చేతుల మీదుగా బోర్వెల్ ప్రారంభం





**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 20 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం 38వ వార్డ్ ఎస్ ఆర్ బి సి రోడ్డులో ఉన్న హెచ్ఐవి పరివర్తన లైఫ్ సెంటర్‌కు శాశ్వత నీటి సౌకర్యం అందించేందుకు ఏర్పాటు చేసిన బోర్వెల్‌ను రాష్ట్ర తెలుగుదేశం యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ విశేషంగా ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ** "ప్రజల సంక్షేమమే మా లక్ష్యం. ముఖ్యంగా ఇలాంటి సేవా సంస్థలకు అవసరమైన నీటి సదుపాయాన్ని తక్షణమే అందించడం టిడిపి బాధ్యత" అని తెలిపారు ప్రిన్సిపాల్ అబ్రహం లింకన్ మాట్లాడుతూ ఈ బోర్వెల్ సమస్య ఎవరి దగ్గరికి వెళ్ళినా కాలేదని ఎన్ఎండి కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లిన నెల సమయంలోనే మా సమస్య పరిష్కారమైంది అని అన్నారు

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు** పాల్గొని బోర్వెల్ ప్రారంభాన్ని అభినందించారు

ఎం ఆర్ రెడ్డి మాజీ కౌన్సిలర్, టిడిపి సీనియర్ నాయకులు మిద్దె చిన్న హుసేని ప్రిన్సిపాల్ అబ్రహం లింకన్ బండి సాలమ్మ 38వ వార్డ్ టిడిపి ఇన్‌ఛార్జి దేరెడ్డి శివనాగిరెడ్డి సుంకయ్య , ఇతర టిడిపి కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు.

ప్రజల అభినందనలు బోర్వెల్ ప్రారంభంతో లైఫ్ సెంటర్‌లోని వందలాది మందికి శుద్ధమైన నీటి సదుపాయం లభించబోతుండడంతో స్థానికులు ఎన్ఎండి ఫయాజ్ ను అభినందించారు.





# మధ్యాహ్న భోజన పథకం జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు ..





**ఒకే రోజు జిల్లాలోని 20 మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 916 మంది అధికారులు మధ్యాహ్నం భోజనం పథకం తనిఖీ..**

**ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పౌష్టిక ఆహారం అందించడమే లక్ష్యం**

**మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలలో రుచి, పరిమాణం లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తప్పవ్**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 20 నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీఓలు, జిల్లా స్థాయి అధికారులు, డివిజనల్ స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు (బుధవారం) ఒకే రోజు 916 మంది అధికారులు జిల్లాలోని 20 మండలాల్లోని మొత్తం పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును సమగ్రంగా పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విధానాన్ని మొట్టమొదటిగా పశ్చిమగోదావరి జిల్లాలోనే అమలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మంచి మెనూ రూపొందించి డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థి దశ నుండే మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జిల్లాలోని 1,383 ప్రభుత్వ పాఠశాలలకు గాను 916 పాఠశాలను 916 మంది అధికారులు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. 916 పాఠశాలల్లో 61,573 మంది విద్యార్థులకు గాను ఆరోజు 52,171 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగిందన్నారు. వీరిలో 50,033 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల నందే భుజించడం జరిగిందన్నారు. అధికారులు మధ్యాహ్న భోజనం పథకం అమలు తనిఖీల్లో మెను పాటింపు, పదార్థాల నాణ్యత, గుడ్ల నాణ్యత, ఆహార రుచి, ఆహార ఉష్ణోగ్రత, వంటగది పరిశుభ్రత, చిక్కీ నాణ్యత, తదితర అంశాలను పరిశీలించి నివేదికలను అందజేయడం జరిగిందన్నారు. ఎక్కువ పాఠశాలల్లో మెను పాటింపు, ఆహార నాణ్యత, పరిశుభ్రత సంతృప్తికరంగా ఉన్నట్లు నమోదు అయినట్లు తెలిపారు. చిన్న లోపాలు గుర్తించిన చోట్ల తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. ప్రతి విద్యార్థికి పోషకాహారం, సురక్షితమైన మరియు నాణ్యమైన భోజనం అందేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు...

# రైతులకు పంపిణీ చేసే పాసు పుస్తకాలు ఏటువంటి తప్పులు లేకుండా ముందుగా సవరణ చేయాలి



**రైతులకు ముందుగా సమాచారం తెలపాలి**

**జాయింట్ ఎల్ పి ఎం లు లేకుండా చేయాలి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి**

**ఉండి: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 20, నంది పత్రిక** పట్టాదారు పాస్ పుస్తకాలు వెరిఫికేషన్ వేగవంతం చేసి తప్పులను ముందుగా సవరణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. ఉండి మండలం చిన్నపులేరు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. పట్టాదారు పాస్ పుస్తకంల పరిశీలన అమలు తీరును స్వయంగా పరిశీలించారు. వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు రికార్డుల నమోదు విధానాన్ని పరిశీలించారు. భూముల వివరాలలో ఎటువంటి పొరపాట్లు లేకుండా కచ్చతత్వంతో నమోదు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జాయింట్ ఎల్ పి ఎం లు ఉన్నవి వేరు చేయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. కొంతమంది రైతులకు స్వయంగా ఫోన్ చేసి అధికారులు పాసు పుస్తకాలు సంబంధించిన సమాచారమును మీకు ముందుగా తెలియజేస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నపులేరు సొసైటీ వద్ద రైతులతో మాట్లాడారు. భూ రికార్డుల ధ్రువీకరణ కార్యక్రమం రైతుల హక్కులను రక్షించే కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు. భూ యజమానుల వివరాలు స్పష్టంగా ఉండటం వలన భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. ప్రతి రైతు తన భూమికి సంబంధించి వివరాలను స్వయంగా పరిశీలించు కోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించు కోవాలన్నారు. చిన్న పుల్లేరు గ్రామానికి సంబంధించి ఏప్రిల్ నెల లో రైతులకు పంపిణీ చేయవలసిన పట్టాదార్ పాస్ పుస్తకం లు రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రక్రియను వేగవంతం పూర్తి చేయాలని మార్చి నెల ఆఖరి కల్లా వెరిఫికేషన్ పూర్తి చేయాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంట ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె .జాషువా, తహసిల్దార్ కె.నాగార్జున, మండల సర్వే అధికారి రత్నవల్లి, వి ఆర్ ఓ లు, వీఆర్ఏలు రైతులు తదితరులు ఉన్నారు.



# రాష్ట్ర భూత్ కమిటీ సెక్రటరీగా రవీంద్రారెడ్డి



**కొత్తపల్లి - నంది పత్రిక :** వైఎస్సార్సీపీ రాష్ట్ర భూత్ కమిటీ సెక్రటరీగా మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన ఎ.రవీంద్రారెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్సీపీ ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర భూత్ కమిటీ సెక్రటరీగా ఎన్నికైన రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తల సహకారంతో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి. పార్టీ సమన్వయ కర్త దార సుదీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

# కృష్ణా జలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం

## -దర్శనమిస్తున్న ప్రాచీన సంగమేశ్వర ఆలయ శిఖర భాగం



**కొత్తపల్లి - నంది పత్రిక :** పురాతనమైన ప్రాచీన సప్తనదీ సంగమేశ్వరాలయం కృష్ణాజలాల నుంచి బయల్పడుతుంది. 'దీంతో కృష్ణాజలాలపై ప్రాచీన సంగమేశ్వరాలయ శిఖర భాగం భక్తులకు సందర్శకులకు దర్శనమిస్తున్నది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా శు క్రవారం 864.9 అడుగులకు చేరుకుంది. దీంతో ఆలయ శిఖరభాగం కృష్ణాజలాలపై తెలియాడుతున్నట్లు భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయ శిఖరం బయట పడుతుండడంతో సంగమేశ్వరానికి భక్తుల తాకిడి ఎక్కువైతుంది.

# సైబర్ నేరాలు,మహిళల భద్రత పై అవగాహన

## ముగతి గ్రామాన్ని సందర్శించిన డి ఎస్పీ భార్గవి,ఎస్సై తిమ్మారెడ్డి



**ఎమ్మిగనూరు ఫిబ్రవరి 20,(నంది పత్రిక)** నందవరం జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి,నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి వారి సిబ్బందితో కలిసి ముగతి గ్రామాన్ని సందర్శించారు.గ్రామస్తులను ఉదేశించి వారు మాట్లాడుతూ మహిళల భద్రత,రోడ్డు భద్రత మరియు సైబర్ క్రైమ్ లపై గురించి తెలిపారు.ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు గురించి మహిళా భద్రత గురించి వారి కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని చిన్నచిన్న విషయాలకు ఆవేశాలు లోను కాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలాని సమస్యలు ఉంటే తమను ఆశ్రయించాలన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్,టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ భార్గవ్ యాదవ్,టిడిపి గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు,గొర్రెల సంఘం అధ్యక్షులు కొండారెడ్డి,ఎపి మోడల్ స్కూల్ చైర్మన్ రవి గౌడ్,ఫీల్డ్ అసిస్టెంట్ కడుబూరి,తాయన్న,వార్డు మెంబర్ నాగరాజు,అగ్బర్ బాషా,చాకలి రామకృష్ణ,టైలర్ సోమేశ్,మంత్రికి రాజు,దమ్మిడి సోమేశ్,వెంకటేష్ గౌడ్,వినోద్ గౌడ్,సురేష్ గౌడ్,రంగన్న,ఈరన్న, విశ్వనాథ్,నాగరాజు,గ్రామ మహిళలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కు మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి

**కోయిలకుంట్ల ఫిబ్రవరి 20 నంది పత్రిక** మూడవ శనివారం కోవెలకుంట్ల పట్టణంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొంటున్నారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరప్రసాద్ శుక్రవారం తెలిపారు.మంత్రిఉదయం 8:30 గంటలకు కోయిలకుంట్ల పట్టణంలోని,సంత పేట లో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని అనంతరం కోయిలకుంట్ల పట్టణంలో జరిగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పారిశుద్ధ్య కార్మికులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

# పంటల ప్రయోగశాలలో 'గోస్పాడు మోడల్ స్కూల్ విద్యార్థులు'

**నంద్యాల ప్రతినిధి ఫిబ్రవరి 20 (నంది పత్రిక):-** కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకం కింద అమలులో ఉన్న ప్రీ-వొకేషనల్ ఎక్స్పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా గోస్పాడు లోని ఏపి మోడల్ స్కూల్ కు చెందిన 6వ నుండి 8వ తరగతి విద్యార్థులు నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంను శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు అక్కడ నిర్వహిస్తున్న వివిధ పంటల పరిశోధనలు, కొత్త విత్తన రకాల అభివృద్ధి విధానాలు, సాగు పద్ధతులు మరియు భూసార పరీక్షల ప్రక్రియల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయోత్పత్తి పెంపు ఎలా సాధ్యమవుతుందో నిపుణులు వివరించారు.ఆర్.ఏ.ఆర్.ఎస్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఏం. జాన్సన్ గారు, డా. ఏ.ఎం. రెడ్డి, డా. అరుణ్ కుమార్, డా. రమాదేవి గారు మరియు సిబ్బంది విద్యార్థులకు పరిశోధనల ప్రాముఖ్యత, వ్యవసాయ రంగంలో ఉన్న అవకాశాల గురించి అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ద్వారా రైతులు పంటలకు అవసరమైన పోషకాలను ఎలా గుర్తించుకోవచ్చో ప్రదర్శన ద్వారా వివరించారు. విద్యార్థుల్లో వ్యవసాయ రంగంపై ఆసక్తి పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ప్రిన్సిపాల్ ఖాజా హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ ట్రైనర్లు నరేష్, ముక్తార్ హుస్సేన్, సమీన మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పీజీ ఆర్ఎస్ లో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ వహించాలి





**సేవ భావంతో విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.**

**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.**

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 20 నంది పత్రిక జిల్లా కలెక్టరేట్ పీజీ ఆర్ఎస్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి తొలిసారిగా ప్రత్యేకంగా నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో పాటు విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, డిఎంహెచ్ఓ జి.గీతా బాయి, డ్వామా పిడి డా.కె.సి.హెచ్ అప్పారావు, డిఆర్డిఏ పీ డి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన దివ్యాంగుల నుండి పిటిషన్లు స్వీకరించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులకు నేరుగా తమ సమస్యలను విన్నవించుకున్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కార ప్రత్యేక పి జి ఆర్ ఎస్ లో నేడు జరిగిన మొదటి సమావేశంలో 40 అర్జీలు రావడం జరిగిందన్నారు. దీనిలో ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు, వైద్యం, ఉపాధి, 15 వేల రూపాయల పింఛన్లు మంజూరు, బ్యాంకు రుణాలు మంజూరుపై పలు విజ్ఞప్తులు అందడం జరిగిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు ఈ సందర్భంగా

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల నుండి అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు పీజీఆర్ఎస్ లో దరఖాస్తులు అందించేందుకు రావాలంటే అనేక వ్యయ ప్రయాసలతో పాటు సహాయకులు ఉండాలని, కావున అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సేవ భావంతో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అధికారులు లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. కొంతమంది నిరుద్యోగ దివ్యాంగులు ఉద్యోగాలు గురించి దరఖాస్తులు సమర్పించగా, ప్రత్యేక జాబ్ మేళా, శిక్షణ ఏర్పాటు ద్వారా అర్హత మేరకు ఉద్యోగాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా స్కిల్ డెవలప్మెంట్ అధికారి డా.పి.లోకమాన్ కు సూచించారు. అదేవిధంగా జీవనోపాధి నిమిత్తం వ్యాపారాలు నిర్వహించుకునేందుకు రుణాలు మంజూరు చేయవలసిందిగా వచ్చిన విజ్ఞప్తుల మేరకు రుణాల మంజూరుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ కు సూచించారు. తొలుత జాయింట్ కలెక్టర్ దివ్యాంగుల అర్జీల నమోదు ప్రక్రియ ఏ విధంగా జరుగుతున్నదో నమోదు కౌంటర్ల వద్ద సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని ఆన్లైన్ లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ రోజు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక (పిజిఆర్ఎస్ లో)అందిన అర్జీలలో కొన్ని పిర్యాదులు ఈ విధంగా ఉన్నాయి. నర్సాపురం నుండి నిప్పులేటి రాజేశ్వరిని వారి కుటుంబ సభ్యులు పి జి ఆర్ ఎస్ కు స్ట్రక్చర్ పై తీసుకురాగా జాయింట్ కలెక్టర్ స్వయంగా వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. 30 సంవత్సరాల నుండి తన కుమార్తె మంచానికి పరిమితమైందని దయచేసి 15 వేల రూపాయల పింఛను మంజూరు తల్లిదండ్రులు జాయింట్ కలెక్టర్ ని కోరగా, జాయింట్ కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన ఆర్. విమల అర్జీ సమర్పిస్తూ, తాను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశానని, 90 శాతం వికలాంగత్వ ధ్రువీకరణ పత్రం ఉందని తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు. మొగల్తూరు మండలం, కె పీ పాలెం గ్రామానికి చెందిన కందులపాటి సూర్య ప్రకాష్ రావు, తన కుమార్తె శాంతి కుమారి పుట్టిన నాటి నుండి నడవలేదని, మంచానికి పరిమితమై ఉందని, నెలకు రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. పోడూరు మండలం, పెనుమదం గ్రామానికి చెందిన కంపాల యేసు రత్నం అర్జీని సమర్పిస్తూ, తాను వికలాంగురాలులని, జీవనోపాధి కొరకు చాలా ఇబ్బంది పడుతున్నానని, గ్రామంలో బడ్డీ కొట్టు పెట్టుకునేందుకు రుణం మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ డే సందర్భంగా నలుగురు శారీరిక వికలాంగులకు క్రచెస్, మూగ, చెవుడు వున్న వికలాంగులకు నాలుగు టచ్ ఫోన్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.అరుణకుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.వి.సూరిబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ డిజిటల్ విధానంలో ...




**అందుకు అనుగుణంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్, వెబ్ పోర్టల్ ...**

**ఖచ్చితమైన వివరాలతో కూడిన జనాభా లెక్కల సేకరణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేస్తాం...**

**జనాభా లెక్కల సేకరణ-2027 రాష్ట్రస్థాయి సమావేశంలో వెల్లడి..**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 20, నంది పత్రిక జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులు అయిన జిల్లా కలెక్టర్లతో రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ప్రత్యేక బాధ్యతగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.

జనాభా లెక్కల సేకరణ విషయంలో జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులైన జిల్లా కలక్టర్లు కీలకపాత్ర పోషించాలని డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా డా.వివిఎల్ఎన్ శర్మ కోరారు. ఈ సమావేశంలో జనాభా లెక్కల సేకరణ-2027 కు సంబంధించిన సన్నద్ధత అంశాలు, మాస్టర్ ట్రైనర్స్, ఫీల్డు ట్రైనర్ల ఖరారు, జిల్లా సెన్సస్ అధికారులు, చార్జి అధికారులకు శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ డా.వివిఎల్ఎన్ శర్మ మాట్లాడుతూ 2027లో నిర్వహించే జనాభా లెక్కల సేకరణ 16వది కాగా స్వాతంత్ర్యం వచ్చాక 8వది మరియు ప్రపంచంలోనే పురాతన మైన జనాభా లెక్కల సేకరణ అని పేర్కొన్నారు. రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్(హెచ్ఎల్ఓ), రెండవ దశ పాపులేషన్ ఎన్యుమరేషన్ (పిఇ) జరుగుతుందని తెలిపారు. ఈసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేకత ఉందని మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో డిజిటల్ అక్షరాస్యత చాలా బాగుందని, కావున ఖచ్చితంగా ఉత్తమ డేటాను సేకరించడానికి వీలు కలుగుతుందని డా.శర్మ పేర్కొన్నారు. జనాభా గణన డేటా ప్రణాళిక, విధాన అభివృద్ధి మరియు సమాజ అవసరాలను అర్థం చేసుకోవడానికి కీలక మైనదిగా ఆయన చెప్పారు. అంతేగాక ఖచ్చితమైన ప్రణాళిక మరియు వనరుల కేటాయింపు కోసం ప్రక్రియ చాలా ముఖ్యమైనదని చెప్పారు. జనాభా గణన విజయవంతం అనేది అంకిత భావంతో పాల్గొనడంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందన్నారు. అంతేగాక డేటా సేకరణ కోసం నియమించబడే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు సమర్ధవంతమైన శిక్షణపై కూడా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. జనాభా లెక్కల సేకరణ విజయవంతం అనేది సేకరించే డేటాను బట్టి ఉంటుందని చెప్పారు. జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఇప్పటికే రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుండి పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని డా.శర్మతెలిపారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమావేశం వివరాలను వెల్లడిస్తూ 2027 జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేకత ఉందని, డిజిటల్ రూపంలో జనాభా లెక్కల సేకరణతో పాటు వెబ్ పోర్టల్ ద్వారా ప్రజలు సహితం వ్యక్తిగతంగా సెల్ఫ్ ఎన్యుమరేట్ చేసుకునేందుకు వీలుందని తెలిపారు. అందుకు అనుగుణంగా మొబైల్ అప్లికేషన్, వెబ్ పోర్టల్ ను రూపొందించడం జరిగిందని తెలిపారు. జనాభా లెక్కల సేకరణ విషయంలో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులు ఆయన జిల్లా కలెక్టర్ కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, వివిధ శాఖల సమన్వయంతో ఖచ్చితమైన వివరాలతో కూడిన జనాభా లెక్కల సేకరణకు అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి అన్ని జిల్లాలకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వివరించారు.



## కుప్పంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక) ఫిబ్రవరి 20 కుప్పం నియోజకవర్గంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ... కుప్పం నియోజకవర్గ పరిధిలోని కుప్పం 132 కే వి, శాంతిపురం మండలం 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్యవసాయానికి సంబంధించిన త్రీఫేస్ విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు, వ్యవసాయ రైతులు సహకరించాలని కోరారు.

## వెలుగోడులో దోమల బెడదపై ఎస్డిపిఐ వినతి పత్రం అందజేత.



వెలుగోడు ఫిబ్రవరి 20 నంది పత్రిక: సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గం తరపున మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లి నరేంద్రకు ఎస్డిపిఐ శ్రీశైలం అసెంబ్లీ అధ్యక్షులు ఆరిఫ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి గౌస్ వినతి పత్రం సమర్పించారు.గత కొన్ని రోజులుగా వెలుగోడు గ్రామంలో పెరుగుతున్న దోమల సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ ప్రతి ఒక్క వీధిలో దోమల బెడద అధికమవడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు జ్వరాలు మరియు వైరల్ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు గ్రామంలోని ప్రతి వీధిలోనూ తక్షణమే ఫాగింగ్ నిర్వహించి, మురుగునీటి నిల్వలను తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్డిపిఐ శ్రీశైలం అసెంబ్లీ అధ్యక్షులు ఆరిఫ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి గౌస్, కమిటీ సభ్యులు ఫయాజ్ పాల్గొన్నారు.

## దేశంలో పెచ్చు మీరిన సామాజిక అసమానతలు... సిపిఐ

**బనగానపల్లెలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన**




బనగానపల్లె ఫిబ్రవరి 20 నంది పత్రిక దేశంలో సామాజిక అసమానతలు పెచ్చు మీరాయని అందరికీ సామాజిక న్యాయం దక్కేలా ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకొని రాజ్యాంగాన్ని కాపాడాలని శుక్రవారం బనగానపల్లె పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం సామాజిక న్యాయం కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ దేశంలో సామాజిక,ఆర్థిక,రాజకీయ అసమానతలను అంతం చేయాలని కుల,మత,లింగ వివక్షతల నిర్మూలనకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని కార్పొరేట్ల సంపదపై పన్నులు విధించాలి.ఆ సంపదను ప్రజలకు పునః పంపిణి చేయాలని పేర్కొన్నారు అదే సమయంలో జన గణనలో కుల గణన చేపట్టాలి.వాటి ఆధారంగా సామాజిక న్యాయం అందించాలని.దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించాలనిలౌకికలి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రభుత్వ రంగ సంస్థలను,దేశ సహజ సంపద వనరులను లికార్పోరేట్ లకు ధారాదత్తం చేయడం మానుకోవాలని.దేశ సంపదను పరిరక్షించాలని స నిరసన కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎరి స్వామి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దమనయ్య మాల మహానాడు సంఘం నాయకులు నాగరాజు సిపిఐ మండల సమితి సభ్యులు మతేష్ ఖాదర్ సుబ్రహ్మణ్యం రవి హోటల్ రాముడు కార్యకర్తలు పాల్గొన్నారు



## మూడవ శనివారము విద్యుత్ మరమ్మత్తులు

బనగానపల్లె ఫిబ్రవరి 20 నంది పత్రిక

బనగానపల్లె పాతపాడు పసుపల సబ్ స్టేషన్ల పరిధిలో మూడవ శనివారం సబ్ స్టేషన్లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ కోతలు ఉంటాయని వినియోగదారులు ఇది గమనించాలని ఏఈ శ్రీనివాసులు తెలిపారు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లెవెన్ కె.వి కోత విధించబడుతుందని వినియోగదారులందరూ దీనికి సహకరించాలని కోరారు

# ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.





**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసిన వాళ్ళ అర్పించిన ఎంపీ బైరెడ్డి శబరి, సర్పంచ్ సిరిగిరి సుజాత.**

నందికొట్కూరు ఫిబ్రవరి 20( నంది పత్రిక )సురక్షితమైన, రుచికరమైన మరియు ఆరోగ్యకరమైన త్రాగునీటిని ప్రజలకు అందించడమే ఆర్వో మినరల్ ప్లాంట్ల స్థాపన యొక్క ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యమనీ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. పగిడ్యాల మండల పరిధిలోని శుక్రవారం లక్ష్మాపురం గ్రామంలో నూతనంగా ఏడు లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభత్సవ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిరిగిరి సుజాత, నాయకులు సురేష్ రెడ్డి, మహమ్మద్ భాషా, ముగ్గ శేఖర్, పగడం రాఘవయ్య, బలరాం, కుమ్మరి లక్ష్మన్న లు ఎంపీ బైరెడ్డి శబరికి చిన్నారులు సంస్కృతిక పాటల నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఎంపీ బైరెడ్డి శబరి సర్పంచ్ సిరిగిరి సుజాతతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పురవీధుల గుండా ఆర్ఓ ప్లాంట్ వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు అనంతరం నూతన ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్ ను ఎంపీ బైరెడ్డి శబరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంపీ బైరెడ్డి శబరి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరో ప్లాంట్ నందు లభించే సురక్షితమైన నీరు సద్వినియోగం చేసుకోవాలని ఆమే ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా మారెమ్మ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం!





**- వడ్డెమాను లో సుంకులా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట**

**- అమ్మవార్లను దర్శించుకున్న ఎస్సై మణికంఠ**

నందికొట్కూరు ఫిబ్రవరి 20 ( నంది పత్రిక) మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ మారెమ్మ సహిత సుంకుల పరమేశ్వరి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట ఉదయం 9:50 నిమిషములకు మేషలగ్న శుభ పుష్కరాంశమునందు విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ పెద్దలు పోచా నాగిరెడ్డి, మాజీ సర్పంచులు కట్టా సత్యం రెడ్డి, కేశవరెడ్డి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది ముందుగా అమ్మవార్లకు ప్రదోష పూజలు, మండప అవహన పూజలు, వాస్తు ,నవగ్రహ యోగిని మండప దేవత అవాహనము, అగ్ని ప్రతిష్టాపనము, తీర్థ ప్రసాదములు వేద ఆశీర్వచనము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ మారెమ్మ సహిత సుంకుల పరమేశ్వరి , రేణుక ఎల్లమ్మ అమ్మవార్లను బ్రాహ్మణ కొట్కూరు ఎస్సై మణికంఠ దర్శించుకున్నారు. అంతేగాక గ్రామ భక్తాదులు గ్రామ ప్రజలు మహిళలు అమ్మవార్లకు నైవేద్యాలు ఏర్పాటు చేసి టెంకాయలు సమర్పించారు. గ్రామ పెద్దలు భక్తులు అందరూ విశేషముగా పాల్గొని విగ్రహాల ప్రతిష్ట జయప్రదం చేసినందుకు గ్రామ పెద్దలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీశ్రీశ్రీ మారెమ్మ సహిత సుంకుల పరమేశ్వరి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బ్రాహ్మణ కొట్టుకూర్ ఎస్సై మణికంఠ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



# బరితెగించిన మట్టి మాఫియా







**గాలేరు నగరి కాలువ మట్టిని యదేచ్చగా తరలించకపోతున్న మాఫియా**

**ఒక టిప్పర్ కు 6000 ట్రాక్టర్కు 4000 చొప్పున సంపాదిస్తున్న మాఫియా దారులు**

**పట్టించుకోని మైనింగ్ శాఖ**

బనగానపల్లె ఫిబ్రవరి 20 నంది పత్రిక మాఫియా దారులు యదేచ్చగా తెగబడ్డారు. ప్రభుత్వ ఖనిజ సంపదను యదేచ్చగా కొల్లగొడుతూ లక్షలు ఆర్జిస్తున్నారు. బనగానపల్లె మండల పరిధిలోని యాగంటి పల్లె సమీపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపట్టిన జలయజ్ఞంలో గాలేరు నగరి కాలువ త్రవ్వకం చేపట్టారు. మట్టి పనులు చేసే సమయంలో కాలువలో నుండి తవ్విన మట్టిని కాలువకు ఇరువైపులా పోశారు. అయితే ఈ మట్టి అక్రమార్కులకు ఒక సంపదగా మారి లక్షలు అర్జించి పెడుతున్నది. కొంతమంది అక్రమార్కులు ఈ మట్టి మాఫియా పై కన్నేసి టిప్పర్ల ద్వారా వాటిని తరలించకపోతున్నారు. ఇందుకు సంబంధించి మాఫియాదారులకు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు గాని లీజులు గాని లేవని కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి శివయ్య ఆరోపించారు . ఈ మాఫియా పై ఆయన మాట్లాడుతూ పట్ట పగలే ఈ మట్టిని మాఫియాదారులు దోచుకుపోతున్నప్పటికీ ఏ ప్రభుత్వ అధికారి గాని ప్రభుత్వం గానీ వాటిని ఆపకపోవడం విడ్డూరమని ప్రజా సంపదను ఈ విధంగా లూటీ చేస్తున్న నాయకులు పట్టించుకోకపోవడం విడ్డూరమని అన్నారు. ఈ మాఫియా నరికట్టకపోతే బనగానపల్లె ప్రాంతంలో సహజ సంపద ఏది నిలబడదని వాపోయారు.

# అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 20, నంది పత్రిక ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ముందుగా వచ్చే శుక్రవారమును సంవత్సరపు చివరి శుక్రవారం గా పరిగణిస్తారు. అందువలన శుక్రవారం దిగువ అహోబిలం ఆలయంలో శ్రీ అమృతవల్లి అమ్మవారికి విశేష నవ కలశ తిరుమంజనం నిర్వహించారు.



శ్రీ అమృతవల్లి అమ్మవారి తిరుమంజనం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, కర్నూల్ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు.



సాయంత్రం శ్రీ అమృతవల్లి అమ్మవారికి మంగళగిరి ప్రభ ఉత్సవం విశేష నాదస్వర కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మెన్ గందం వీర రాఘవ రెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, అహోబిలం వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# మహానంది క్షేత్రంలో వైభవంగా స్వామివారి పల్లకి సేవ



మహానంది ఫిబ్రవరి 20 (నంది పత్రిక):- మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారికి వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.శుక్రవారం సందర్భంగా ఈవో ఎన్.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.పూజలు అనంతరం ఆలయ ప్రాకారంలో మేళాతాళాల నడుమ వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.



# వివాహ వేడుకలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ



నంది పత్రిక -ప్యాపిలి ప్యాపిలి లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన సిబిల్లి రాజు కుమార్తె వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకురాలు కోట్ల సుజాతమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివాహ వేడుకకు విచ్చేసిన ఆమెకు సిబిల్లి రాజు మరియు కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కోట్ల సుజాతమ్మ నూతన వధూవరులను అక్షింతలు వేసి, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, అన్యోన్యంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబిల్లి రాజు కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, వివాహ బంధంతో ఒక్కటైన నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వివాహ వేడుకలో ఖాజాపీర్,శ్రీనివాసులు,రాంమోహన్,ఎస్కె వలి,వెంకటేష్,రమేష్,బాలకృష్ణ పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ కు శుభాకాంక్షలు



కేసముద్రం, ఫిబ్రవరి 20(నంది పత్రిక):ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో కేసముద్రం మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన బానోత్ సునీత వెంకన్నను శుక్రవారం బేరువాడ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జూకంటి కుమార స్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేసముద్రం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాక్షించారు. కాంగ్రెస్ నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి వైభవంగా వడిబియ్యం కార్యక్రమం..





నంది పత్రిక / చాగలమర్రి న్యూస్ ; నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణములో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిపించారు.ఆలయ పూజారి రాధాకృష్ణ ఆధ్వర్యములో అమ్మవారికి దశ దీప హారతులు ఇచ్చారు.ఆలయం చుట్టూ అమ్మవారి రథ సేవ నిర్వహించారు.మహిళల ఆధ్వర్యములో అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఉభయదారులుగా మాలేపాటి సత్యనారాయణ సతీమణి పద్మావతి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ ,ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు , కమిటీ సభ్యులు , భక్తులు , తదితరులు పాల్గొన్నారు.



## ఫామాయిల్ తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన.







**కేసముద్రం, ఫిబ్రవరి 20(నంది పత్రిక):**ఫామాయిల్ తోటల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం కేసముద్రం మండలం కల్వల గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సేనాల వీరారెడ్డికి చెందిన ఫామాయిల్ తోటలో ఫీల్డ్ ఆఫీసర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారిణి ప్రియదర్శిని, ఆయిల్ ఫెడ్ అధికారి రాములు, పిఎంఓ రంజిత్ లు ఫామాయిల్ తోటల పెంపకాన్ని ఎలా చేపట్టాలి, తోటల నిర్వహణ ఎలా నిర్వహించాలి, పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించి, ఫామాయిల్ తోట ద్వారా ఎలాంటి అభివృద్ధి సాధించవచ్చనే విషయాలను రైతులకు తెలియజేశారు. ఆయిల్ ఫామ్ వేయవలసిన రైతులు ఫీల్డ్ ఆఫీసర్ రాజ్ కుమార్ ని 9676840473 నెంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లావణ్య, రైతులు పెరటి వెంకట్రాం నర్సయ్య, ఆకుల సుధాకర్, శ్రీపాల్ రెడ్డి, చింతనూరి రమేష్, మూల వెంకట్ రెడ్డి, వేముల శ్రీను, సుంకరి వెంకన్న, మూల వెంకన్న, కల్వల రైతులతో పాటు కోమటిపల్లి రైతులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు.

**కేసముద్రంలో "శివాజీ మహారాజ్ జంక్షన్" గా నామకరణం చేయాలని భారీ ర్యాలీ.**

**కదలివచ్చిన వందలాది మంది యువకులు.**





**కేసముద్రం, ఫిబ్రవరి 20(నంది పత్రిక):**స్థానిక కేసముద్రం పట్టణంలో గురువారం రాత్రి ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను స్థానిక యువకులు, దేశభక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీలో 100 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా, అత్యంత ఉత్సాహంగా పాల్గొని 'జై భవానీ.. జై శివాజీ' నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు. స్థానికంగా ఉన్న 'పొట్టి శ్రీరాములు జంక్షన్' కు జాతి గర్వించదగిన హైందవ వీరుడు "ఛత్రపతి శివాజీ మహారాజ్ జంక్షన్" గా నామకరణం చేయాలని ఈ సందర్భంగా యువత, దేశ భక్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. హిందూ ధర్మ రక్షణ, దేశభక్తి, శివాజీ మహారాజ్ ఆదర్శాలను భావితరాలకు అందించాలనే దృఢ సంకల్పంతో, యువత ఎంతో క్రమశిక్షణతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో కేసముద్రం యువకులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు.

## గున్నంపాడులో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి పదకొండవ వార్షికోత్సవం అంగారంగా వైభవంగా నిర్వహించిన వెంకటేశ్వర స్వామి కళ్యాణం.



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని గున్నంపాడు గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 11వ వార్షికోత్సవ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం వచ్చినటువంటి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**-- డి ఈ ఓ జనార్ధన్ రెడ్డి**



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 20, నంది పత్రిక** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనీ జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని ఆర్ కృష్ణాపురం, బాచేపల్లి లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల స్టడీ అవర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండ కూడదన్నారు. పాఠశాల ముస్తాబు కిట్స్ ఉపయోగించుకొని పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు రాబోయే పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామపంచాయతీ పాలకవర్గంతో సమావేశం.





**- 15వ ఆర్థిక ప్రణాళిక నిధులు తో ఆమోదం పొందిన పనులు చేపట్టాలి.**

**- ఐదు రోజుల శిక్షణా తరగతులకు విధిగా హాజరు కావాలి**

**- అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు.**

**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 20( నంది పత్రిక )** ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని, పాత్రాపురం రైతు వేదిక లో శుక్రవారం సర్పంచ్ లకు,ఉప సర్పంచ్ లకు, వార్డు సభ్యుల కు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఆమోదం పొందిన వివిధ పనులను చేపట్టాలని, 15వ ఆర్థిక ప్రణాళిక నిధులు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సూచించారు. వార్డు .సర్పంచ్ లు అందరూ తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి అని, సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు పరస్పర సహకారం తో గ్రామాల అభివృద్ధి కి తోడ్పాటు అందించాలని సూచించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అయ్యాయి అని, అవి గ్రామ పంచాయతీల ఖాతాలో జమ చేయడం జరిగింది అని, అవి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేస్తే నే, 16 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. సిగ్నేచర్ డిజిటల్ కి సర్పంచులు వద్దనే ఉండాలని, తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల వద్ద డిజిటల్ కీ ఉంచవద్దని సమావేశంలో ఆదేశించారు. సర్పంచ్ లు సిగ్నేచర్ డిజిటల్ కీ విషయం లో భాధ్యత పూర్తి గా మీదే అని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. మేడారం జాతర సందర్భంగా కొన్ని మండలాల సర్పంచ్లకు శిక్షణ తరగతులు వాయిదా పడ్డాయని, తిరిగి ఈనెల 21వ తేదీ నుండి తాడ్వాయి లోని ప్రభుత్వ భవనాల్లో ఐదు రోజులు పాటు శిక్షణ తరగతులు సర్పంచులుకు ఉంటాయని, భోజన వసతి సౌకర్యం ఉంటుందని తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. శిక్షణ తరగతులు హాజరుకాని సర్పంచ్ల లకు హైదరాబాదులో శిక్షణ ఉంటుందని తెలిపారు. మండలాల్లోని ఉపసర్పంచ్ లకు, వార్డ్ సభ్యులకు, శిక్షణ అవగాహన సమావేశాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, వివిధ శాఖలజిల్లా అధికారులు, తహశీల్దార్ వేణు గోపాల్,మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జిమ్మీ లాల్, ఇరిగేషన్ అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో పరిశీలన రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సంపత్ రావు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండల పరిధిలోని రామచంద్రపురం పంచాయతీ గోదావరి తీర ప్రాంతంలో, గతంలో నిర్మించిన పుష్కర ఘాట్ ను పరిశీలించారు. పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా వివిధ అభివృద్ధి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.గ్రామస్తులు, పుష్కర ఘాట్ చుట్టు ప్రక్కల వివిధ సమస్యల పై విన్నవించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తాసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో జమ్మీలాల్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్, సబ్ ఇన్స్పెక్టర్ కొప్పుల తిరుపతిరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవి



**అమరాపురం నంది పత్రిక న్యూస్ ఫిబ్రవరి 20:** మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ హెంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మరథోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి స్థానిక నాయకులతో కలిసి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని శ్రీ సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారు మాట్లాడుతూ చారిత్రక హేమావతి గ్రామంలో శ్రీ హెంజేరు సిద్దేశ్వర స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగిందని ఈ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని స్థానిక నాయకులతో ఆప్యాయంగా పలకరిస్తూ అందరితో కలిసి బ్రహ్మోత్సవంలో పాల్గొని స్వామి వారి కృపలో పాత్రులైనారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్ విండో ప్రెసిడెంట్ గణేష్, మాజీ జెడ్పీటీసీ, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, రామచంద్రప్ప, వక్కలిగ గౌడ రంగప్ప, రామమూర్తి, శ్రీ మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.



# సర్వే చేపట్టిన రైతులకు నష్ట పరిహారం వెంటనే అందజేయాలి.

## ఎంసిపిఐయు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత.



**కేసముద్రం, ఫిబ్రవరి 20(నంది పత్రిక):**కేసముద్రం మండలం ఎంసిపిఐయు ఆధ్వర్యంలో శుక్రవారం ఏఈఓ మంగ శ్రీనివాస్ కు గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వరదలు వచ్చి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం డబ్బులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయు మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ గత 2025 సంవత్సరంలో ఖరీఫ్ లో పంటలప్పుడు విపరీతమైన వరదలు రావడం మూలంగా రైతుల పంటలు దెబ్బతిన్న పంట నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ అధికారులు సర్వేలు నిర్వహించారు. కానీ ప్రభుత్వం సర్వే చేయించి కాలం గడిచిపోతున్నా, ఇప్పటి వరకు పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని, ఇప్పటికైనా నష్టపోయిన రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే నష్టపరిహారాన్ని రైతుల ఖాతాలలో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి వినతి పత్రం ద్వారా తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే దశలవారీగా పోరాటాలు చేపడతామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపిఐయు మండల సహాయ కార్యదర్శి బొల్లోజు రామ్మోహన చారి, ఏఐసీటియు కార్మిక సంఘం నాయకులు మాచర్ల వెంకన్న, కంచ అశోక్, ఎస్సల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

పెద్దపల్లి: జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

## నిషేదిత భూముల జాబితా - 22-ఎ కు సంబంధించి అర్జీదారులు నుండి వచ్చిన దరఖాస్తులు విచారణ అనంతరం 03 దరఖాస్తులు పరిష్కారం.

**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.**



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 20 నంది పత్రిక** కలెక్టరేట్ ఛాంబర్ లో శుక్రవారం అర్జీలపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విచారణ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హక్కుల భూమి మరియు పట్టాదార్ పాసుబుక్స్ చట్టం 1971 కింద ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా, సాధారణ అర్జీల ద్వారా జిరాయితీ భూముల వివాదం పై దాఖలు చేసిన అర్జీలు మొగల్తూరు మండలం 01, పాలకోడేరు మండలం 01, ఆంధ్ర ప్రదేశ్ రిజిస్ట్రేషన్ చట్టం -1908 నిషేదిత భూముల జాబితా 22-ఎ నుండి భూముల తొలగింపు కొరకు దాఖలు చేసిన అర్జీ కాళ్ల మండలం 01 మొత్తం 03 అర్జీలు సంబంధిత తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, సర్వే సిబ్బందితో విచారణ జరిపి, రికార్డులను పరిశీలించిన అనంతరం 03అర్జీలను పరిష్కరించడం జరిగిందని జిల్లా జాయింట్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు..

# మంత్రి చొరవతో కారుణ్య నియామకాలు

## పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు మంత్రి సీతక్క కి కృతజ్ఞతలు

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 ( నంది పత్రిక )** ప్రజా ప్రభుత్వ ఏర్పాటు లో పంచాయతీరాజ్ లాంటి కీలక శాఖకు మంత్రి గా ఉన్న డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) పంచాయతి రాజ్ శాఖ ఉద్యోగుల తో స్నేహభావంతో ఉంటూ, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపెడుతున్నారు.గత పది సంవత్సరముల నుండి పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాల విషయంలో చొరవ చూపి వందలాది కుటుంబాలకుపెద్ద దిక్కు గా ఉండి దాదాపు 574 నియమకాలు చేశారు, 317 జీవో విషయంలో ఉద్యోగుల సర్దుబాటు, పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కారంలో చొరవ చూపి వారికి అండగా ఉన్నారు, చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న పదోన్నతులు 19/02/2026 రోజున ( 27) మంది డిప్యూటీ సీఈఓ లకు పదోన్నతి కల్పించి సీఈవోలుగా నియామకం చేశారు, (55) మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు డిప్యూటీ సీఈవోలుగా పదోన్నతులు కల్పించారు, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సూపర్డెంట్ లకు దాదాపు (60) ఎంపీడీవోలుగా పదోన్నతుల కోసం కార్యాలయంలో కసరత్తు మొదలు పెట్టినారు. కార్యాలయాల్లో ఉద్యోగులు ఉత్సాహంతో పని చేయాలని ఆలోచనతో పదోన్నతులు కల్పిస్తున్నట్లు మరియు ఉద్యోగులకు న్యాయపరంగా రావలసిన ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ మరియు శిశు సంక్షేమ మంత్రివర్యులు . డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) కి తెలంగాణ పంచాయతీ రాజ్ ఉద్యోగుల పక్షాన ములుగు జేఏసీ కన్వీనర్ మడగురి నాగేశ్వరరావు మరియు పంచాయతీరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు బర్మావత్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో



మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థిక భారం లేని ఎన్నో విషయాలు పరిశీలనలో ఉన్నట్లు మరియు సూపర్డెంట్ల కు రావలసిన గెజిటెడ్ హోదాను త్వరలో పరిష్కరించాలని వారు మంత్రికోరినారు. నాగేశ్వరరావు మడుగురి జేఏసీ కన్వీనర్ మరియ ముఖ్య సలహాదారు పంచాయతీ రాజ్ ములుగు మరియు బర్మావత్ శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు పంచాయతి రాజ్ శాఖ, తదితరులు ఉద్యోగస్తులు పాల్గొన్నారు

# కర్రే గుట్టలు, పామునూరు కొండలపై ఐ ఈ డి బాంబు పేలుడు

### కూంబింగ్ లో పాల్గొన్న సీఆర్పీఎఫ్ జవాన్ కు తీవ్ర గాయాలు.

### అత్యవసర వైద్యం కోసం హెలికాప్టర్ ద్వారా తరలింపు.



**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 20 ( నంది పత్రిక )** ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాల సరిహద్దు చత్తీస్గడ్ అటవీ ప్రాంతంలో కగార్ ఆపరేషన్ సందర్భంగా, కూంబింగ్ నిర్వహిస్తున్న సిఆర్పిఎఫ్ జవాన్ లు మావోయిస్టు లు అమర్చిన ఐ ఈ డి బాంబు పేలటంతో, ఒక జవాన్ తీవ్రంగాయపడ్డాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు. బాంబు పేలుళ్ల లోగాయపడ్డ సిఆర్పిఎఫ్ జవాన్ను ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా శుక్రవారం సాయంత్రం వెంకటాపురం మండల కేంద్రం వద్ద హెలికాప్టర్ ల్యాండ్ అయింది. వెంటనే గాయపడ్డ జవానును వరంగల్, హైదరాబాద్ తరలించినట్లు సమాచారం. ఈ సంఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మేడారం సమ్మక్క సారక్క గుడి ప్రాంగణం అపరిశుభ్రత..





### అధికారుల నిర్లక్ష్యంతో గుడి ప్రాంగణం దుర్వాసన

### గుడి ప్రాంగణంలోకి గేదలు ఆవులు ప్రవేశించడం..

### జిల్లా అధికారులు ప్లాస్టిక్ వాడకం నిషేధం... అది ప్రచారం వరకే కొనసాగింది

### గుడి ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వదిలేసిన పారిశుద్ధ్య కార్మికులు

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20( నంది పత్రిక )**

ములుగు జిల్లా తాడువాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. లక్షలాది మంది భక్తులు పాల్గొని సమ్మక్కసారలమ్మలను దర్శించుకున్నారు. జాతర శాంతియుతంగా ముగిసినప్పటికీ, యాత్ర అనంతరం గుడి ప్రాంగణంలో పరిశుభ్రత సమస్యలు ఉత్పన్నమయ్యాయి. భక్తులు మొక్కులు తీర్చుకునే భాగంగా సమర్పించిన బెల్లం పెద్ద ఎత్తున గుట్టలుగా పేరుకుపోవడం గమనార్హం. వీటి వల్ల ఈగలు, దోమలు అధికంగా పెరగడంతో పాటు దుర్వాసన వ్యాపిస్తోంది. అదనంగా, ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం గుడి పరిసరాల్లో పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు, అలాగే జాతర అనంతరం దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం గుడి ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, దోమల వ్యాప్తితో వ్యాధులు వ్యాపించే అవకాశముందని వారు పేర్కొన్నారు.అధికారులు తక్షణమే స్పందించి: గుడి ప్రాంగణంలో పేరుకుపోయిన బెల్లం గుట్టలను తొలగించడంప్లాస్టిక్ వ్యర్థాలు మరియు చెత్తను పూర్తిగా శుభ్రపరచడం కీటకనాశక మందులు పిచికారీ చేయడం శాశ్వత పారిశుధ్య చర్యలు చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖలు బాధ్యత వహించి మేడారం గుడి పరిసరాలను పరిశుభ్రంగా మార్చి భక్తులకు అనుకూల వాతావరణం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# మేడారం జాతరపై పుస్తకావిష్కరణ కార్యక్రమం

### - “గాడెస్ ఆఫ్ ఫోక్” పేరుతో రూపొందించిన విశిష్ట గ్రంథాన్ని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ




**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 ( నంది పత్రిక )** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వైభవాన్ని ప్రతిబింబించే “గాడెస్ ఆఫ్ ఫోక్” పేరుతో రూపొందించిన విశిష్ట గ్రంథాన్ని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈరోజు విడుదల చేశారు. ఈ గ్రంథాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ ఆవిష్కరించారు. పూలే ప్రజా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రనిర్మాత బి నర్సింగ్ రావు పుస్తకాన్ని సంకలనం చేశారు. అరుదైన ఛాయాచిత్రాలు, చారిత్రక వివరాలు, జాతర సాంస్కృతిక వైభవం, గిరిజన సంప్రదాయాల విశిష్టతలను ఈ గ్రంథంలో సమగ్రంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బిపి ఆచార్య, బివి పాపారావు, రిటైర్డ్ ఎన్ఐటి ప్రొఫెసర్ పాండురంగారావు, కె శ్రీధర్ మరియు రిటైర్డ్ డిజిపి ఎం రతన్ హాజరయ్యారు. మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మేడారం జాతర గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మహోత్సవాన్ని ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు పొందేలా చేయడానికి యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందేందుకు అవసరమైన ప్రతిపాదన సిద్ధం చేయాలని ట్రస్ట్‌కు సూచించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేపట్టిన ఈ ప్రచురణ మేడారం జాతర చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను భవిష్యత్ తరాలకు అందించే విలువైన ఆధార గ్రంథంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.



# సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్చి మొదటి వారం వరకు కొనసాగించాలి.

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా కార్యదర్శి ఎండి అంజాద్ పాషా డిమాండ్.

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20( నంది పత్రిక )** ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు మండల కమిటీ సమావేశము మండల ఉపాధ్యక్షుడు బానోతు నారాయణసింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ములుగు మండల కేంద్రంలో ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజాద్ పాషా హాజరై మాట్లాడుతూ ములుగు జిల్లాలో సుమారు 35 వేల ఎకరాలలో పత్తి పంట సాగు అయిందన్నారు. ప్రతి పంట మార్చి మొదటి వారం వరకు పూర్తిగా చేతికి అచ్చే అవకాశం ఉందన్నారు. కావున ములుగు జిల్లాలో సీసీఐ ప్రతి పంట కొనుగోలు కేంద్రాన్ని మార్చి మొదటి వారం వరకు కొనసాగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రం లేనిచో ములుగు జిల్లా రైతాంగం మద్దతు ధర రాక నష్టపోయే అవకాశం ఉందన్నారు. ములుగు జిల్లా అధికారులు చొరవతో సీసీఐ కేంద్రాన్ని మార్చి మొదటి వారం వరకు కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు వాంకుడదు



వెంకట్రాం. రమేష్ శ్యాంసుందర్ ఐలయ్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కీసర శ్రద్ధ స్ఫూర్తి కళాశాల 12వ వార్షికోత్సవం

### ఆత్మవిశ్వాసమే విజయానికి మార్గం. ఎండీ మదర్



**నంది దినపత్రిక** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాల ని, క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగితే విజయాలు సాధ్యమవుతాయని శ్రద్ధ జూని యర్ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ ఎండీ మదర్ అన్నారు. కీసరలోని శ్రద్ధ జూనియర్ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాలల 12వ వార్షికోత్సవ వేడుకలు పగిడిశిలా ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భశీగా కళాశాల కరస్పాండెంట్ ఎండీ మదర్, సహీమా మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవా లంటే కష్టపడి చదవడం, క్రమశిక్షణతో ముందుకు సాగ డం అవసరమని అన్నారు. గ్రామీణ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పాఠ్యాంశాలను మని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరి మితం కాకుండా సమగ్ర అభివృద్ధి దిశగా కృషి చేయా లని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలి చాయి. నృత్య ప్రదర్శనతో చిన్నారి మాన్వా అందరి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు నర్సింహులు, యమున, భాస్కర్, పుష్ప, సోమ శేఖర్, రేణుక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు....

# క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రులకు చేర్చాలి

### 108 ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ జాన్ షాహిద్



**వెల్దండ ఫిబ్రవరి 20 ప్రతినిధి/ రామాంజనేయులు** నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండల కేంద్రంలో 108 వాహనాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ జాన్ షాహిద్ తనిఖీ చేశారు. అంబులెన్స్ లోని పరికరాలు, వాహన నిర్వాహణ, మందుల లభ్యత, ఆక్సిజన్ నిల్వలను పరిశీలించడంతోపాటు నెలవారీ నమోదు కేసుల వివరాలపై ఆరా తీశారు. 108 అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రులకు చేర్చాలని సూచించారు. ఇతనికిల జిల్లా మేనేజర్స్ బోయిని శ్రీను, శ్రీహరి , 108 సిబ్బంది సాయి బాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు

### ఇసుక పేరు ఇందిరమ్మది నోరు దళారులది

**వెల్దండ ఫిబ్రవరి 20 ప్రతినిధి రామానుజన్** : వెల్దండ మండల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. ‘దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని‘చందంగా ఉంది ఇసుక లభ్యమవుతున్న తీరు. ఇందిరమ్మ నుంచి ఇసుక ఉచితమైన ప్రభుత్వ సంఘటన భాగానికి ట్రాక్టర్ యజమానులు లబ్ధిదారులను పిండేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ట్రిప్పు ఇసుకకు రూ. 4 వేలు ఉండగా ప్రస్తుతం రూ.6500 చిల్లర ధర పలుకుతోంది. ఇసుక ఉచితమే కదా అని ప్రశ్నిస్తే రవాణా భారం అంటూ మాటల గారడి చేస్తున్నారు వ్యాపారులు. ఇసుక ఇస్తామని ఖర్చులు తగ్గించేందుకు భరించాలని ఆర్థిక భారం తప్పడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.



# యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

మహిమాన్విత యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడి మత్స్యావతార అలంకార వైభవం భక్త జనులను అలరించింది. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని అభిషేకించి మత్స్యావతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు.

# ఎన్నికల ఫలితాలు పనితీరుకు గీటురాయి కాదు !

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రయోజనాత్మక నిర్ణయాలు ఇంకా తీసుకోలేదు. అయితే వరుస ఎన్నికల్లో గెలవడం వల్ల అధిష్ఠానం వద్ద మార్కులు కొట్టేశారు. మంత్రులంతా కలసి కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌ను కలిసి శహభాష్ అనిపించుకున్నారు. ఇలాగే పనిచేయండని కాంగ్రెస్ అగ్రనేతలు దీవించి పంపారు. ఇది మాత్రమే కాంగ్రెస్ విజయం కాదు. ఢిల్లీలో కూర్చున్న నేతలకు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన లేదు. సిఎం రేవంత్ కూడా క్షేత్రస్థాయి సమస్యలపై ఇంకా దృష్టి సారించలేదు. ప్రధానంగా తాగు,సాగునీటి సమస్యలు, రైతుల నుంచి ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరలు అందించడం, నిరుద్యోగ సమస్యలు తీర్చడం వంటివన్నీ ప్రధానంగా వెన్నాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో తెలంగాణలో అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉన్న సమస్యలే ఇంకా ఉన్నాయి. అవేవీ పరిష్కారం కాలేదు. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు పంచాయితీ, ఇంకా అంతకుముందు రెండు ఉప ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనకు గీటురాయి కాబోవు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వంపై కొంత కాలంగా విరుచుకుపడుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ పనైపోయినట్లేనని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నాయకులు అది నిజమని కూడా నమ్ముతున్నారు. ఈ ప్రచారానికి తోడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినందున ఇటీవలి వరుస ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే బిఆర్ఎస్ అంచనాకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. కేటీఆర్,హరీష్ రావులుకు ఈ ఫలితాలు ఓ రకంగా హెచ్చరిక లాంటివి. ఎందుకంటే గత పాలనలో తాము చేసిన పాపాలను పక్కన పెట్టి అదేపనిగా విమర్శలు చేస్తూ పోతే ప్రజలు ఆదరిస్తారని అనుకుంటున్నారు. ప్రజలు అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు. ఏవరేమిటో గ్రహిస్తున్నారు. అయితే సిఎం రేవంత్ అందరినీ కలుపుకుని వరుస విజయాలను సాధిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇప్పటికీ తమ నేతగా అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఆయన జూనియర్ అని పలువురు వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. లాటరీ తగిలినట్లు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని బిఆర్ఎస్ చేస్తున్న ముఖ్యంగా కెటిఆర్ చేస్తున్న ఆరోపణఅలను వీరు కూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవ్వరినీ నొప్పించకుండా వెళుతోంది. అందుకే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం వ్యూహాత్మకంగా పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అగ్ర నాయకకతంవ ముందు మార్కులు కొట్టేస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ మంచి ఫలితాలను సాధించేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లున్న కాంగ్రెస్‌ను ఏక తాటిపై నడిపించడంలోనూ రేవంత్‌రెడ్డి కృతకృత్యులయ్యారు. కాంగ్రెస్ సీనియర్లు కూడా తన నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితిని కల్పిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతంపైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను ఆయన అధిగమిస్తూ వచ్చారు. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నట్టుగా ఉంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కూడా రేవంత్ భుజం తట్టి ప్రోత్సహించింది. శహభాష్ అంటూ పొగిడింది. ఇలాగే నడవండి అంటూ అందరినీ కలిపి సూచించింది. అయితే ఇవొక్కటే రేపటి గెలుపునకు బాటలు వేయవు. గుణాతమక మార్పులు రావాలి. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. మంత్రులు వసూల్ రాజాలుగా మారారని పుంఖానుపుంఖానుగా ఆరోపణలు వస్తున్నాయి. పర్సంటేజీలకు అలవాటు పడ్డారని అంటున్నారు. ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది.

ఈ అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. ఉద్యోగుల్లో లంచావతారాలు పెరిగాయి. విద్యుత్ శాఖలో ఏకబిగిన ఓ 9మందిని సస్పెండ్ చేశారు. రోజుకోచోట్ ఎక్కడో ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నాడు. ఈ సమస్య పోవాలి. గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఈ ఫలితాలు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్‌రెడ్డి స్థానం మరింత పటిష్ఠమవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకో మూడేళ్ల వ్యవధి ఉంది. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. అది నిజమైతే బీఆర్ఎస్‌కు మైనస్ అవుతుంది. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోగలగాలి. అందుకు కార్యాచరణ అవసరం.

# ఐఆర్‌డీఎస్ ఒక జాతీయ అవసరం!




దేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ప్రధానంగా ఐఏఎస్ అధికారులకు లేదా ఇతర కేంద్ర, రాష్ట్ర సేవల అధికారులకు అదనపు బాధ్యతలుగా అప్పగిస్తున్నారు. ఒక అధికారికి రెవెన్యూ, అభివృద్ధి, ఎన్నికలు, శాంతిభద్రతలు వంటి అనేక బాధ్యతలుండగా, గ్రామీణాభివృద్ధి మరో అదనపు అంశంగా మారుతోంది. ఫలితంగా ఇది తాత్కాలిక పరిపాలనా బాధ్యతగా మిగులుతోంది. గ్రామీణాభివృద్ధి అనేది అత్యంత సున్నిత, విస్తృతమైన ప్రజల జీవితాలతో నేరుగా ముడిపడిన రంగం. దీనికి ప్రత్యేక శిక్షణ, దీర్ఘకాలిక దృష్టి, క్షేత్రస్థాయి అనుభవం, స్థానిక అవసరాలపై లోతైన అవగాహన కలిగిన అధికారుల సేవలు అత్యవసరం. 1993లో అమలులోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణ భారతదేశ ప్రజాస్వామ్యంలో ఒక మైలురాయి. దీంతో పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక స్వయంపాలనా సంస్థలుగా గుర్తించి, గ్రామీణ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ హోదా కల్పించారు. ఈ సవరణలో భాగంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలు గ్రామ పంచాయతీలకు బదలాయించి విధులు, నిధులు, సిబ్బంది వికేంద్రీకరణను అమలు చేయాల్సి ఉంది. అయితే ఈ సవరణ అమలై మూడు దశాబ్దాలు గడిచినా అనుకున్న లక్ష్యం సిద్ధించలేదు. చాలా రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ సంస్థలు పేరుకే స్వయంపాలనా సంస్థలుగా మిగిలిపోయాయి. విధులు అప్పగించకపోవడం, నిధులపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ కొనసాగడం, సిబ్బంది ఇతర శాఖలకు లోబడి ఉండడం వంటి కారణాల వల్ల పంచాయతీలు స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ గ్రామీణ అభివృద్ధి సర్వీస్ (ఐఆర్‌డీఎస్) ఏర్పాటు చేయడం ద్వారా 73వ రాజ్యాంగ సవరణ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఈ అధికారులు ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి కోసం శిక్షణ పొందినవారుగా, పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో పనిచేస్తూ విధులు, నిధులు, సిబ్బంది వికేంద్రీకరణను సమర్థవంతంగా అమలు చేయగలరు. స్థానిక ప్రజల అవసరాలు, సమస్యలు, వనరులు గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం ఐఆర్‌డీఎస్ ద్వారా సాధ్యమవుతుంది. గ్రామీణాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ఉపాధి, కార్యక్రమాల సమన్వయం, మౌలిక వసతుల అభివృద్ధి, నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, మూల్యాంకనం వంటి వాటిని ఐఆర్‌డీఎస్ ద్వారా బాధ్యతాయుతంగా అమలుచేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విభిన్న శాఖల మధ్య చీలిపోయిన బాధ్యతలు ఐఆర్‌డీఎస్ ద్వారా ఒకే వ్యవస్థలోకి రావడంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు స్పష్టత లభిస్తుంది. వికసిత భారత్ వంటి జాతీయ లక్ష్యాలు, వీబీజీరామ్‌జీ వంటి గ్రామీణ ఉపాధి, ఆర్థిక స్వావలంబన పథకాలు విజయవంతం కావాలన్నా కూడా ఈ ఐఆర్‌డీఎస్ వ్యవస్థ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న నిరుద్యోగం, నగరాల వైపు యువత వలసలు, వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల ఆదాయ అస్థిరత, పథకాల అమలులో లోపాలు ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక పరిపాలనా సేవ లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఆర్థికంగా, పాలనాపరంగా బలపడాలంటే ఐఆర్‌డీఎస్ అత్యవసరం. అందువల్ల కేంద్ర ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసి 73వ రాజ్యాంగ సవరణలో ఊహించిన విధంగా పంచాయతీరాజ్‌కు ప్రాణం పోయాల్సి ఉంటుంది.

# గాడ్గిల్, బెటీల్: జ్ఞాన స్రష్టలు, భావిద్రష్టలు

ఇటీవల మన మధ్య నుంచి ఇద్దరు జ్ఞానమూర్తుల శాశ్వత నిష్క్రమణ మన మేధాసంస్కృతిపై ఈ నిశిత వ్యాఖ్యలకు నన్ను పురిగొల్పింది. నా యవ్వనంలో నన్ను అమితంగా ప్రభావితం చేసిన ఆ మేధా సమున్నతులలో ఒకరు పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్, మరొకరు సామాజిక శాస్త్రవేత్త ఆంద్రే బెటీల్. గాడ్గిల్ గత నెల 7న ఎనభై మూడేళ్ల వయస్సులోను, బెటీల్ ఈ నెల 3న తొంభై ఒకటవ ఏట మరణించారు. 1982లో గాడ్గిల్‌ను నేను మొదటిసారి కలుసుకున్నప్పుడు నా వయసు 24 ఏళ్లు కాగా ఆయన 40 వసంతాల యువకుడు. బెటీల్‌తో 1988లో నాకు పరిచయమైనప్పుడు నేను 30వ పడిలోకి ప్రవేశించగా ఆయన తన నడిమి యాభైలలో ఉన్నారు. వయోభేదం ఎంతగా ఉన్నప్పటికీ ఆ ఇరువురితో తొలిసారి సంభాషించిన క్షణానే మా మధ్య స్నేహభావం అంకురించి, కుసుమించి తుదివరకూ దినదినమూ ప్రవర్ధమానమయింది. అప్పుడప్పుడూ మా కుటుంబాల గురించి మాట్లాడుకున్నప్పటికీ ఆ ఇరువురితో నా సంభాషణలు, సమాలోచనలు చాలావరకు సమాజం, రాజకీయాలు, చరిత్ర, పర్యావరణం, భారతదేశం, ప్రపంచం గురించి జరిగేవి. ఇరువురి జీవిత ప్రస్థానాలు భిన్నమైనవి. గాడ్గిల్ మరాఠీ భాషీయుడు. పూణేలో పెరిగారు. బెటీల్ తండ్రి ఫ్రెంచ్ జాతీయుడు, తల్లి బెంగాలీ. చంద్రనాగోర్‌లో పుట్టి పెరిగిన బెటీల్ విద్యాభ్యాసం చాలావరకు కలకత్తాలో జరిగింది. విద్యాలయాల్లో ఆంగ్లంలోనూ, ఆటపాటల సందర్భాలలో స్నేహితులతో బెంగాలీలోనూ సంభాషిస్తుండేవారు. బెటీల్ తన డాక్టోరల్ డిగ్రీ భారత్‌లోనే తీసుకోగా, గాడ్గిల్ అమెరికాలో పీహెచ్‌డీ సముపార్జించారు. గాడ్గిల్ వృత్తి జీవితం చాలావరకు బెంగళూరులో, బెటీల్ బోధన, పరిశోధన వ్యాపకాలు ఢిల్లీలో జరిగాయి. గాడ్గిల్, బెటీల్ ఎప్పుడూ కలుసుకోలేదు. అయితే తమ పరస్పర స్నేహితుడు అయిన ఈ వ్యాసకర్త ద్వారా సదా ఒకరి విషయాలు మరొకరు తెలుసుకుంటూ ఉండేవారు. గాడ్గిల్, బెటీల్ జీవిత ప్రస్థానాలు భిన్నమైనవని అన్నానా? కావచ్చు కానీ ఇరువురి మధ్య ఒక సమున్నత ఏకత్వం ఉన్నది. వారి మేధా జీవితాలను చూడండి. అద్భుతమైన సారూప్యతలు కనిపిస్తాయి. ఇరువురి చింతనా ధోరణి, మేధా జీవితాచరణలలో పది గుణాత్మక విశిష్టతలు ప్రస్ఫుటమవుతాయి. అవి నన్ను ప్రభావితం చేశాయి. మేధా జీవితాలను గౌరవించే వారెవరికైనా అవి స్ఫూర్తిదాయకమైనవే, సందేహం లేదు. వాటిని విపులీకరిస్తాను: ఒకటి గాడ్గిల్, బెటీల్ ఇరువురూ తమ దృక్పథంలో నికార్సయిన ఇంటర్‌డిసిప్లినరీ విద్వజ్జులు (బహుళ విద్యా విభాగాల సిద్ధాంతాలు, పద్ధతులు అంతర్దృష్టులను సమగ్రపరిచి, ఒకే విద్యా విభాగం నుంచి అర్థం చేసుకోలేని సంక్లిష్ట సమస్యలను విశ్లేషించే ప్రాజ్ఞులు). చరిత్రకారులు, ఆర్థికవేత్తలు, న్యాయశాస్త్ర కోవిదులను తన పరిశోధనలలో భాగస్వాములను చేసుకున్న సామాజిక శాస్త్రవేత్త బెటీల్. మానవ శాస్త్రవేత్తలు, చరిత్రకారులతో సహకార పరిశోధనలు నిర్వహించిన పర్యావరణవేత్త గాడ్గిల్; రెండు తమ మేధా కృషిలో ఇరువురూ సిద్ధాంతం, అనుభావిక పరిశోధనలను సమన్వయపరిచినవారు. మానవ జాతుల అధ్యయనవేత్తగా శిక్షణ పొందిన బెటీల్ తులనాత్మక సామాజిక శాస్త్రవేత్తగా పరిణమించగా, పర్యావరణం పట్ల సైద్ధాంతిక దృక్పథంతో విద్వత్ జీవితాన్ని ప్రారంభించిన ప్రాకృతిక ప్రపంచంతో వైవిధ్య మానవ పరస్పర చర్యల ప్రభావాలను పరిశోధించేందుకు విస్తృతంగా క్షేత్ర అధ్యయనాలు నిర్వహించారు గాడ్గిల్; మూడు ఇరువురూ తమ బోధనా విధులను నిబద్ధతతో నిర్వహించినవారు. అంతేకాదు సంస్థా నిర్మాణం పట్ల అంకితభావం చూపినవారు. బెటీల్ అధ్యాపక జీవితం ఢిల్లీ విశ్వవిద్యాలయం, ముఖ్యంగా సామాజికశాస్త్ర విభాగంతో పూర్తిగా ముడివడి ఉన్నది. గాడ్గిల్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ముఖ్యంగా ఆ ప్రతిష్ఠాత్మక సంస్థలోని సెంటర్ ఫర్ ఎకోలాజికల్ సైన్సెస్‌తో భావోద్వేగ అనుబంధం ఉన్నది; నాలుగు తమ విద్వత్ కృషిని ప్రజలకు వివరించడంలో ఇరువురూ ప్రభావశీల ఫలితాలను సాధించారు. అయితే తమను తాము కార్యకర్తగా గానీ లేదా క్రియాశీలిమేధావిగా గానీ ఇరువురూ భావించుకోలేదు. తమ విద్వత్ కృషికి సంబంధించిన అంశాలలో మాత్రమే తమ ప్రజా బాధ్యతలను పరిమితం చేశారు; అయిదు ఇరువురూ తమ కన్న ఊరు, సొంత రాష్ట్రం వెలుపల విద్యాభ్యాసం, పరిశోధనలు చేయడం, వృత్తి జీవితం గడపడం ద్వారా తమ మేధా ప్రపంచాన్ని విశాలం చేసుకున్నారు. పరిపూర్ణమైన విద్వత్ కృషి చేశారు. కలకత్తాలో కాకుండా ఢిల్లీలో బెటీల్ బోధన, పరిశోధనలు జరిగాయి. గాడ్గిల్ వృత్తి జీవితమంతా పూణేలో కాకుండా బెంగళూరులో జరిగింది. సొంత రాష్ట్రాలకే పరిమితమైన విద్వజ్జుల కంటే విశాల దృక్పథంతో సమున్నతమైన విద్యా కృషి చేశారు. బెటీల్ తన క్షేత్ర పరిశోధనలను తమిళనాడులో నిర్వహించగా, కర్ణాటక, కేరళలో గాడ్గిల్ పరిశోధనలు జరిగాయి. అయినప్పటికీ ఇరువురూ తమ సొంత ప్రదేశాలు, వాటి సంస్కృతికి దూరం కాలేదు; ఆరు భారత్ వెలుపల విశాల ప్రపంచం పట్ల ఇరువురూ విశేష శ్రద్ధాసక్తులు చూపేవారు. అన్ని దేశాల విద్వజ్జులతో కలిసి తమ మేధా వ్యాసంగాలను కొనసాగించేవారు తమ మేధా ఆసక్తులలో ఇరువురూ నిక్కమైన భారతీయులు, నిజమైన అంతర్జాతీయవాదులు; ఏడు తమ మనో వైఖరులు, ఆలోచనా రీతులలో ఎటువంటి సంకుచితత్వం ఏ కోశానా లేకపోయినా ఇరువురూ భారత్‌లోనే నివసిస్తూ, వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూ జాతి మేధా జీవితాన్ని సమున్నతపరిచారు. గాడ్గిల్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపక ఉద్యోగాన్ని వదులుకుని స్వదేశానికి వచ్చేశారు. కేంబ్రిడ్జ్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాలు ఆహ్వానించినప్పటికీ స్వదేశంలోని ఢిల్లీ విశ్వవిద్యాలయానికే అంకితమైన ఆచార్యోత్తముడు బెటీల్; ఎనిమిది ఇరువురూ ఉత్తమ దేశభక్తులు. భారతదేశం పట్ల తమ ప్రేమాభిమానాలను మనసా వాచా కర్మణా వ్యక్తపరిచారు.

## రైతులకు యూరియా 'యాప్' సోపాలు



**వెల్దండ ఫిబ్రవరి 20 ప్రతినిధి రామానుజన్:** యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫర్టిలైజర్ యాప్ తో అపసోపాలు పడుతున్నారు. వెల్దండ మండలానికి సింగిల్ విండో ద్వారా శుక్రవారం ఉదయం సూర్య బస్తాలు వచ్చాయని ఉదయం 10: 45 నిమిషాలకు బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ సింగిల్ విండోస్ సిబ్బంది సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. సింగిల్ విండో కార్యాలయానికి గంట ముందే చేరుకున్న పలువురు రైతులు, వారి పిల్లల చరవాణులు పట్టుకొని సమయం వరకు వేచి ఉండి బుకింగ్కు ప్రయత్నించారు. కానీ 12 సెకండ్లు 57 మంది రైతులు బుకింగ్ చేసుకున్నారు. ఉదయం నుంచి వేచి ఉన్నప్పటికీ యూరియా బుకింగ్ అవ్వకపోవడంతో రైతులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. యాప్ ద్వారా కాకుండా పాత పద్ధతిలోనే రైతులకు యూరియా సరఫరా చేయాలని రైతులంతా డిమాండ్ వ్యక్తం చేశారు.

## ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి




**వెల్దండ ఫిబ్రవరి 20 ప్రతినిధి రామాంజనేయులు** వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయానికి దాతలు సహకరించి విరాళాలు అందజేయాలని కమిటీ సభ్యులు కోరారు. గతంలో వెల్దండ మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి దేవాలయ నిర్మాణానికి రెండు విడతలుగా రూ.3 లక్షల రూపాయలు విరాళం అందజేశారని తెలిపారు. ఇంకా భక్తులందరూ పెద్ద మొత్తంలో విరాళాలు సమకూరిస్తే గుడి త్వరలోనే పూర్తి అవుతుందని అన్నారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ దేవాలయం నిర్మాణం గత 25 సంవత్సరాల క్రితం మొదలై నేటికీ పూర్తవ్వకపోవడం తో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## ఓటమి భయంతోనే ఎంపీటీసీ, జెడ్పిటిసి వ్యవస్థ రద్దు ఆలోచన

### బీఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకులు పోలే అశోక్



**వెల్దండ ఫిబ్రవరి 20** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల తీరును ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని బారాస మండల యువ నాయకులు పోలే అశోక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సహకార సంఘాల పదవీ కాలం, ఎంపీటీసీ, జెడ్పిటిసిల పదవీకాలం ముగిసి దాదాపు 20 నెలలు గడుస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోతామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించలేక.. భయంతోనే ఆ ఎన్నికల వ్యవస్థను రద్దు చేయాలని ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిర్వహించి ప్రజల చేత నాయకులు ఎన్నుకోబడాలే కానీ.. అన్ని పదవులను నామినేటెడ్ పోస్ట్ చేస్తామంటే ఎలాగా అని ప్రశ్నించారు. ఇదే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం ఆలోచించి.. ఎమ్మెల్యేలను, ఎంపీలను ముఖ్యమంత్రిని ఎన్నుకునే విధానాన్ని కేంద్ర ప్రభుత్వాలు నామినేటెడ్ చేస్తే అప్పుడు రాజకీయాలు సందిగ్ధంలో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పదవులు ,పదవుల వికేంద్రీకరణ జరగాలి తప్పా.. ఏకీకృత ఏక కేంద్రంగా ఆలోచించకూడదని అన్నారు. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తో సింగిల్ విండో, ఎంపీటీసీ మరియు జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ వ్యక్తం చేశారు.

## మంగళగిరిలో చేనేత గర్జన

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.25 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల కోట్లు కేటాయించాలి. రాష్ట్ర అధినాయకత్వం తమ వాగ్దానం మేరకు నేతన్నలతో పాటు, చేనేత ఉపవృత్తులు చేసుకునే కార్మికులందరికీ ప్రతి సంవత్సరం రూ.25వేల ఆర్థిక సహకారం అందించాలి. 200 యూనిట్ల వరకూ విద్యుత్‌ను వారికి ఉచితంగా అందించే పథకాన్ని అమలుపరచాలి. సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.203 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. వీటితో పాటు, ఆ సంఘాల్లోని రుణాలనూ రద్దు చేయాలి. చిలప నూలు, పట్టు, రంగులు, రసాయనాలను సబ్సిడీ రేట్లకు సప్లై చేయాలి. వీటితో పాటు చేనేత వస్త్రాలపై జీఎస్టీని రద్దు చేయాలి. నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వాలు కొనుగోలు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో నేతన్నలకు రూ.10 వేల ఆర్థిక సహకారం అందించాలి. ఆత్మహత్యలు, ఆకలి చావులతో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలి. కేంద్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలి... వంటి డిమాండ్లతో ఫిబ్రవరి 22న ఉదయం 10 గంటలకు 'చలో మంగళగిరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com